విలేఖరులు కావలెను.

తెలుగు జనశక్తి

సామాజిక స్పృహతో, అవినీతి అక్రమాలను వెలికితీసే ధైర్యం,
ప్రజాసమస్యలను నిర్భయంగా రాసే వారికి
తెలుగుజనశక్తి దిన పత్రిక అవకాశం కల్పిస్తుంది.
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల వారిగా
స్టాఫ్ రిపోర్టర్‌లు, నియోజక వర్గాల వారిగా ఆర్సి ఇన్‌చార్జిలు,
మండలాల వారిగా రిపోర్టర్‌లు కావలెను.

సెల్: 6302660543



RNI : TELTEL/2024/89275

# తెలుగు జనశక్తి

Published From Adilabad, Hyderabad, Khammam, Karimnagar, MahabubNagar, Medak, Nalgonda, Nizamabad, Rangareddy, Kamareddy, Waranagal

హైదరాబాద్ | ఆదివారం | 15.06.2025 | సంపుటి : 02 | సంచిక : 160 | వెల : 4/-




దక్షిణాఫ్రికాదే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ 07



42శాతం బిసి రిజర్వేషన్లతోనే

## స్థానిక ఎన్నికలకు పోవాలి

- సామాజిక తెలంగాణ కోసం విద్యార్థులు పోరాడాలి 03
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

## నైరుతి మందగమనంతో
# వర్షాలు ఆలస్యం

- రైతన్నను కుంగదీస్తున్న వర్షాభావం
- తొలకరి ఆలస్యంతో ఆందోళన

ప్రస్తుత వాతావరణం చూస్తుంటే ఇంకా ఎండాకాలం ఉందా లేక వానాకాలమేనా అన్నట్లుగా ఉంది. రుతుపవనాలు వచ్చి పక్షం రోజులు దాటినా పూర్తిస్థాయిలో వర్షాలు కురియడం లేదు. వర్షాలు ముఖం చాటేయడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. తొలకరి రాక ఆలస్యం కావడంతో ఇప్పటికే దుక్కులు దున్ని విత్తనాలు వేసేందుకు రైతులు సిద్దంగా ఉన్నారు. కొన్నిచోట్ల పత్తి నాటుకున్నారు. దీంతో ఆ రైతుల్లో ఆందోళన తీవ్రం అవుతోంది.



04



07

## గుడ్ న్యూస్
హెూమ్‌లోన్ వడ్డీ రేట్లు
# తగ్గించిన ఎస్‌బీఐ..

## బంగారు ఆభరణాలు, వెండి తాకట్టు రుణాలకు
# ఆర్‌బీఐ కొత్త మార్గదర్శకాలు



07



## చిత్ర పరిశ్రమ
# గొప్పగా రాణించాలి

### తెలంగాణ అభివృద్ధికి దోహదపడాలి

- హాలీవుడ్, బాలీవుడ్.. హైదరాబాద్‌కు రావాలి
- రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం
- సినీ పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తాం
- గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి
- అట్టహాసంగా గద్దర్ అవార్డుల వేడుక
- తరలివచ్చిన తెలుగు తారా లోకం

తెలుగు సినీపరిశ్రమకు అన్ని విషయాల్లోనూ తమ ప్రభుత్వం అండగా ఉంటుందని, హాలీవుడ్, బాలీవుడ్ చిత్ర పరిశ్రమలను కూడా హైదరాబాద్ గడ్డ మీదకు తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. కొన్ని అంశాల్లో కఠిన నిర్ణయాలు తీసుకున్నప్పటికీ.. సినీ పరిశ్రమ అభివృద్ధికి తోడ్పాటును అందించడంతో పాటు సముచిత స్థానం కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

**హైదరాబాద్, జూన్ 14 :**

తెలంగాణ గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం హైటెక్స్ లో ఘనంగా మొదలైంది. దాదాపు దశాబ్దం తరవాత మళ్లీ సినిమా పండగ జరగడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి. సీఎం రేవంత్ రెడ్డితో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్‌రాజు, ఎఫ్‌డీసీ ఎండీ హరీశ్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకను ప్రారంభించారు. సినీ ప్రముఖులు బాలకృష్ణ, అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, నాగ్ అశ్విన్, సుకుమార్, మణితర్నం, సుహాసిని తదితరులు సందడి చేశారు. పలువురు విజేతలకు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి అవార్డులు అందజేశారు. ఉత్తమ హీరో అవార్డును పుష్పకు గాను హీరో అల్లు అర్జున్‌కు సిఎం రేవంత్ రెడ్డి అందించారు. ఉత్తమ నటిగా నివేదా థామస్, ఉత్తమ దర్శకుడిగా నాగ్‌అశ్విన్‌లు పురస్కారాలు స్వీకరించారు. కాంతారావు ఫిల్మ్ అవార్డును విజయ్ దేవరకొండ, రఘుపతి వెంకయ్య పురస్కారాన్ని యండమూరి వీరేంద్రనాథ్, పైడి జైరాజ్ అవార్డును మణిరత్నం, బీఎన్‌రెడ్డి పురస్కారాన్ని సుకుమార్, నాగిరెడ్డి–చక్రపాణి ఫిల్మ్ అవార్డును అట్లూరి పూర్ణచంద్రరావు అందుకున్నారు. ఈ వేడుకలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గతంలో భారతీయ సినీ పరిశ్రమ అంటే బాలీవుడ్ అని చర్చించుకునేవారని.. ఇప్పుడు భారతీయ సినీ పరిశ్రమ అంటే తెలుగు సినీ పరిశ్రమగా చెప్పుకోవడం అందరికీ గర్వకారణమన్నారు. తమ ప్రభుత్వం చిత్ర పరిశ్రమను గౌరవించి అన్ని వసతులు కల్పిస్తోందని వివరించారు.

మిగతా 2 లో

## జి-7 సదస్సులో పాల్గొననున్న ప్రధాని మోదీ

- నేటి నుంచి మూడ్రోజుల పాటు విదేశీ పర్యటన 06





## విమాన ప్రమాదాలు పునరావృతం కాకుండా
# అప్రమత్తం

- అంతర్గత ఆడిటింగ్‌లు.. ప్రత్యేక తనిఖీలు
- ఎయిరిండియా బోర్డు నిర్ణయం

## తెలంగాణలో
# స్థానిక సందడి

- మంత్రుల ప్రకటనలతో నేతల అలర్ట్
- గ్రామాల్లో ఊపందుకోనున్న రాజకీయ వేడి



04

తెలంగాణలో స్థానిక సంస్థలకు త్వరలోనే ఎన్నికలంటూ మంత్రులు అడపాదడపా ప్రకటనలు చేస్తున్నారు. గెలిచేది తామేనని కూడా ప్రకటిస్తున్నారు. ఈ క్రమంలో జూన్, జూలై మధ్య ఎన్నికలకు అవకాశాలు మెండుగా ఉన్నాయి. సర్పం చ్, ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలను నిర్వహించేలా లోలోపల వేగంగా పావులు కదుపుతున్నాయని అనుకోవచ్చు. ఇటీవల మం త్రులు తుమ్మల నాగేశ్వర రావు, సీతక్క తదితరులు వరుస ప్రకట నలు చేస్తున్నారు. అలాగే రెవెన్యూ సదస్సుల పేరుతో మంత్రులు జిల్లాల పర్యటనలు చేసేస్తున్నారు. ఇదంతా ఓ రకంగా ప్రజల్లో తమ బలాన్ని మరింత పెంచుకునేలాచేసే యత్నమని గుర్తించాలి. ఈ క్రమంలో గ్రామాల్లో రాజకీయ వేడి రాజుకుంటోంది. కొన్ని రోజులుగా రాజకీయ పార్టీల సందడి జోరుగా కనిపిస్తోంది.

## రాజకీయ నిఘా కోసమే
# ఎస్‌వోటీ ఏర్పాటు

- సిట్ తాజా విచారణలో ప్రభాకర్‌రావు అంగీకారం!
- ప్రణీత్‌రావుకు ప్రత్యేక బాధ్యత అప్పగించానని వెల్లడి
- అనుమతులకు 'మావోయిస్టు' ముసుగు
- ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక మలుపు

**హైదరాబాద్:** ఫోన్ అక్రమ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును ప్రశ్నిస్తుండటంతో కేసులో చిక్కుముడులు వీడుతున్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు రాజకీయ నిఘా కోసమే ఎస్ఐబీలో ప్రత్యేక విభాగాన్ని(ఎస్‌వోటీ) ఏర్పాటు చేశానని ప్రభాకర్‌రావు అంగీకరించినట్లు తెలిసింది. ఈ పని చేసేందుకే ప్రణీత్‌రావును ఎస్ఐబీకి తీసుకొచ్చానని చెప్పినట్లు సమాచారం. ప్రధానంగా భారాసకు వ్యతిరేకంగా ఉన్న వారిని లక్ష్యంగా చేసుకొని వారికి సంబంధించిన ఫోన్లలో

మిగతా 2 లో





## బనకచర్లపై
# మౌనం ఎందుకు?

- కేంద్రానికి లేఖ రాయని సీఎం.. ఉత్తమ్‌వి ఉత్తుత్తి మాటలు : మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం
- అఖిలపక్ష సమావేశం పెట్టాలని.. శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని డిమాండ్

02

## జగన్‌తో మిలాఖత్ అయి
# కృష్ణా జలాల దోపిడీ

- కృష్ణాజలాల వాటాను కేవలం 299 టిఎంసిలకే పరిమితం
- పదేళ్లలో దోచిపెట్టిన ఘనులు బిఆర్‌ఎస్ పాలకులు
- బనకచర్లపై మేము అప్రమత్తంగానే ఉన్నాం
- హరీష్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్, జూన్ 14 :** నదీ జలాల హక్కులపై తెలంగాణకు నష్టం చేసింది బిఆర్‌ఎస్ పార్టీనే అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. కృష్ణానది వాటాను కేవలం 299 టిఎంసిలకే పరిమితం చేశారని.. బిఆర్‌ఎస్ హయాంలోనే ముచ్చుమర్రి, మాల్యాల నుంచి నీటిని తరలించారని అన్నారు. రాయలసీమ ఎత్తిపోతలపై అపెక్స్ కౌన్సిల్‌ను మీరెందుకు సంప్రదించలేదని ప్రశ్నించారు. ఎపి రోజూ 3 టిఎంసిలు మళ్లిస్తుంటే కెసిఆర్ చోద్యం చూశారని.. జగన్, కెసిఆర్ అవగాహనతోనే తెలంగాణ నీటిని ఎపికి దోచిపెట్టారని పేర్కొన్నారు.

మిగతా 2 లో

# రాజకీయ నిఘా కోసమే ఎస్‌వోటీ ఏర్పాటు

(మొదటిపేజీ తరువాయి)

సంభాషణలను అక్రమంగా వినే ఉద్దేశంతోనే ప్రణీత్‌రావు ఆధ్వర్యంలో స్పెషల్ ఆపరేషన్ టార్గెట్(ఎస్‌వోటీ) విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు సిట్‌కు వివరించినట్లు తెలిసింది. కేవలం రాజకీయ నిఘా కోసమే ఈ విభాగం పనిచేసిందని తెలిపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఇదంతా ఎవరి ప్రోద్బలంతో చేయాల్సి వచ్చిందనే కోణంలో సిట్ తాజాగా దర్యాప్తు చేస్తోంది. తగిన ఆధారాలు లభిస్తే రాజకీయంగా సంచలనాలు వెలుగు చూసే అవకాశం కనిపిస్తోంది. ప్రభాకర్‌రావును ఇప్పటికే రెండు విడతలుగా విచారించిన సిట్.. శనివారం మూడో విడత సుదీర్ఘంగా మాట్లాడి వివరాలు రాబట్టింది. ముఖ్యంగా 2023 శాసనసభ ఎన్నికలకు ముందు భారాసకు వ్యతిరేకంగా ఉన్న వారితో సహా ఇతర ప్రముఖుల ఫోన్లపై ఎస్‌వోటీ నిఘా ఉంచేందుకు అనుమతులెలా వచ్చాయని సిట్ ఆరా తీయడంతో చాలా విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నిఘా ఉంచాల్సిన ఫోన్ నంబర్ల జాబితాలు.. డిజిగ్నేటెడ్ అథారిటీ హోదాలో ప్రభాకర్‌రావు పేరుతోనే ఉన్నతాధికారులకు వెళ్లేవి. ఆ ఫోన్ నంబర్లపై ఎందుకు నిఘా ఉంచాలని తెలిపే సమయంలో 'మావోయిస్టు' ముసుగు వాడారు. మావోయిస్టులకు డబ్బులు, ఔషధాలు, ఆయుధాలు సరఫరా చేస్తున్నారంటూ ప్రముఖులందరికీ ముద్ర వేశారు. ఉన్నతాధికారులూ ఆ ఫోన్ల జాబితాలకు ఆమోదం తెలిపారు. అనంతరం ప్రభాకర్‌రావు బృందం ఆ జాబితాలనే సర్వీస్ ప్రొవైడర్లకు పంపింది. అలా విన్న ఫోన్ల కాల్ రికార్డులను నిక్షిప్తం చేసిన హార్డ్‌డిస్క్‌లనే ఎన్నికల ఫలితాల తర్వాత ధ్వంసం చేసింది.

## ప్రణీత్‌రావు పొరపాటు.. ప్రభాకర్‌రావుకు గ్రహపాటు

ప్రణీత్‌రావు చేసిన పొరపాటు ప్రభాకర్‌రావుకు గ్రహపాటుగా మారినట్లు కనిపిస్తోంది. 2023 డిసెంబరులో ప్రభాకర్‌రావు బృందం తమ సెల్‌ఫోన్లు, కంప్యూటర్లలోని డేటాను పకడ్బందీగా డిలీట్ చేసింది. మరోవైపు ఈ బృందం ధ్వంసం చేసి మూసీలో పడేసిన హార్డ్‌డిస్క్‌లను వెలికితీసి ఎఫ్‌ఎస్‌ఎల్ ద్వారా విశ్లేషించినా విలువైన సమాచారమేదీ లభ్యం కానట్లు తెలిసింది. అయితే ప్రణీత్‌రావు 2023 జూన్ వరకు తాను వినియోగించిన ఫోన్‌లోని డేటాను డిలీట్ చేయడం మరిచిపోయారు. ఎఫ్‌ఎస్‌ఎల్ విశ్లేషణ క్రమంలో ఆ ఫోన్‌లో సేవ్ చేసిన రాజకీయ నేతల సంభాషణలు తాజాగా సిట్ చేతికి అందాయి. భాజపాలో ఉన్న ఒక మాజీ ఎంపీ, అలాగే సిద్దిపేటకు చెందిన ఒకరి సంభాషణలు ఆ ఫోన్‌లో బహిర్గతమయ్యాయి. దీంతో రాజకీయ నిఘా జరిగిందనేందుకు కీలక ఆధారాలు లభ్యమైనట్లయింది. ప్రస్తుతం వీటి గురించి ప్రభాకర్‌రావు సమాధానం చెప్పాల్సి ఉంది.

## నేటి నుంచి బాధితుల వాంగ్మూలాల నమోదు

సిట్ అధికారులు శనివారం ప్రభాకర్‌రావును సుమారు 9 గంటలపాటు విచారించారు. ఈనెల 17న మరోసారి విచారణకు రావాలని ఆదేశించారు. ఆయన సెల్‌ఫోన్లను జప్తు చేయాలని సిట్ నిర్ణయించింది. మరోవైపు ఆదివారం నుంచి బాధితుల వాంగ్మూలాలను నమోదు చేయనుంది.

# చిత్ర పరిశ్రమ గొప్పగా రాణించాలి

(మొదటిపేజీ తరువాయి)

'నటులు, దర్శకులు, సినీ పరిశ్రమను ప్రోత్సహించేందుకు 1964లో నంది అవార్డులను తీసుకువచ్చారు. తొలిసారి ఉత్తమ నటుడిగా అక్కినేని నాగేశ్వరరావు నంది అవార్డు అందుకున్నారు. అప్పటి నుంచి ఉమ్మడి రాష్ట్రంలో 14 ఏళ్ల క్రితం వరకు నంది అవార్డులు ఇస్తూ వచ్చారు. తర్వాత వివిధ కారణాలతో అవి ఆగిపోయాయి. అవార్డుల కార్యక్రమాన్ని పునరుద్ధరించాలని సినీ పరిశ్రమ ప్రముఖులు, టీఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్‌రాజు ప్రతిపాదించారు. మా ప్రభుత్వం నంది అవార్డుల స్థానంలో తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల పేరుతో ప్రదానం చేయాలని నిర్ణయించింది.



## మీకేం కావాలో చెబితే.. ప్రభుత్వ సహకారం

నటులు, కళాకారులు, దర్శకులు.. ఇలా అందరినీ గౌరవించాలని ఈ కార్యక్రమం ఏర్పాటు చేశాం. సినీ పరిశ్రమలో తొలి తరం.. అన్న ఎన్టీఆర్, ఏయన్నార్, రెండోతరంలో.. కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు.. మూడోతరంలో చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జున వంటి కథనాయకులు వచ్చారు. నేడు నాలుగోతరంలో పవన్‌కల్యాణ్, మహేష్‌బాబు, అల్లు అర్జున్ వంటి వారున్నారు. వీరంతా పరిశ్రమలో రాణిస్తున్నారు. బన్నీ, వెంకట్, అశ్వనీదత్ కుమార్తెలు, ఆయన అల్లుడు నాగ్‌అశ్విన్ ఇలా చాలామంది నాకు కాలేజీ రోజుల నుంచి తెలుసు. మా యువమిత్రులు పరిశ్రమలో రాణించడం.. వారిని నేను అభినందించడం సంతోషకర సందర్భం. తెలంగాణ రైజింగ్- 2047 నినాదంతో ముందుకు వెళుతున్నాం. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే ఆ సమయానికి ప్రపంచాన్ని శాసించే ఆర్థిక వ్యవస్థగా దేశం అభివృద్ధి చెందాలి. ఐటీ, ఫార్మా, రక్షణ, సినీ పరిశ్రమలు గొప్పగా రాణించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ స్థాయికి అభివృద్ధి చేస్తామని ఇటీవల నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోదీకి చెప్పా. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు సినీ పరిశ్రమ గొప్పగా అభివృద్ధి చెందాలి. హాలీవుడ్ అంటే అమెరికాకు, బాలీవుడ్ అంటే ముంబయికి వెళ్తున్నారు. దర్శకుడు రాజమౌళిని అడుగుతున్నా.. ప్రపంచం గుర్తించేలా మీరు అద్భుతమైన సినిమాలు తీస్తున్నారు.. హాలీవుడ్, బాలీవుడ్ పరిశ్రమను ఈ గడ్డకు ఎందుకు తీసుకురావడం లేదు? ఆ పరిశ్రమల వారు కూడా హైదరాబాద్ గడ్డపై షూటింగ్‌లకు రావాలి. అందుకోసం మీకేం కావాలో చెబితే ప్రభుత్వం అండగా ఉంటుంది.

## గద్దరన్న అంటే చైతన్యం

గద్దరన్న ఒక విప్లవం, చైతన్యం, వేగుచుక్క. ఆయన స్ఫూర్తితో తెలంగాణ సాధించుకున్నాం. ఆయన స్ఫూర్తితోనే ప్రజలకు అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తున్నాం. తెలంగాణ పురోగతిలో చిత్ర పరిశ్రమ భాగం కావాలి. గతంలో ఏమైనా అంశాలున్నా వాటిని పక్కన పెట్టండి. అందరం కలిసి అభివృద్ధి వైపు నడవాలి. గద్దరన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేస్తున్నా.. పాతబస్తీ వాసి రాహుల్ సిప్లిగంజ్ సంగీత రంగంలో అద్భుతంగా రాణిస్తున్నారు. ఆయనకు ఏదైనా అవార్డు ఇవ్వాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

## అట్టహాసంగా అవార్డుల ప్రదానోత్సవం

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గద్దర్ చలన చిత్ర పురస్కారాల కార్యక్రమం అట్టహాసంగా సాగింది. చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖ నటులు, దర్శకులు, నిర్మాతలు హాజరు కావడంతో సందడిగా మారింది. 2014 నుంచి 2023 వరకు ఉత్తమ చిత్రాలకు.. 2024లో అన్ని విభాగాలకు గద్దర్ ఫిల్మ్ అవార్డులను ప్రదానం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమంలో దాదాపు గంటన్నర పాటు ఉండి పురస్కారాలు ప్రదానం చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 11 వరకు ఈ వేడుక జరిగింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆర్‌అండ్‌బీ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, టీఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు, ఎండీ హరీశ్, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులు హాజరయ్యారు. సినీ పరిశ్రమ నుంచి నిర్మాతలు అల్లు అరవింద్, అశ్వనీదత్, ఆర్.నారాయణమూర్తి, సంగీత దర్శకుడు కీరవాణి, దర్శకుడు రాజమౌళి, గేయ రచయిత చంద్రబోస్, నటీమణులు జయసుధ, జయప్రద, సుహాసిని తదితరులు హాజరయ్యారు.

### తెలంగాణ విజన్ 2047లో చిత్ర పరిశ్రమకు చాప్టర్

తెలంగాణ ప్రభుత్వ 2047 విజన్ డాక్యుమెంట్‌లో చలనచిత్ర పరిశ్రమకు ఒక చాప్టర్ ఇస్తాను. నేను మరో 22 ఏళ్లు క్రియాశీల రాజకీయాల్లో ఉంటా. ఏ హోదాలో ఉన్నా.. మీకు అండగా నిలుస్తా. చిత్ర పరిశ్రమను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడానికి అన్ని రకాలుగా ప్రోత్సాహకాలు, సహకారం అందిస్తాం. ప్రపంచంలోని ఫార్చ్యూన్-500 కంపెనీల్లో 85 తెలంగాణ గడ్డపైనే ఉన్నాయి. దేశంలో ఏ నగరంలోనూ ఇన్ని కంపెనీలు లేవు. బెంగళూరు, అమరావతి, ముంబయి, చెన్నై.. ఈ నగరాలేవీ హైదరాబాద్‌కు పోటీ కాదు.. మా పోటీ న్యూయార్క్, టోక్యో వంటి నగరాలతోనే. పరిశ్రమల్లో చైనాతో పోటీ పడాలన్నది మా ఆలోచన.

### గద్దర్ ఫౌండేషన్‌కు రూ.3 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: గద్దర్ ఫౌండేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. గద్దర్ జయంతి వేడుకల సందర్భంగా ఆయన పేరిట ఉన్న ఫౌండేషన్‌కు నిధులు ఇస్తామని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు తాజాగా నిధులు మంజూరు అయ్యాయి. గద్దర్ ఆలోచనలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఫౌండేషన్‌కు ఈ నిధులు కేటాయించినట్లు రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇకపై గద్దర్ జయంత్యుత్సవాల నిర్వహణలోనూ ఫౌండేషన్‌కు భాగస్వామ్యం కల్పిస్తూ ప్రభుత్వం మరో ఉత్తర్వును జారీ చేసింది.

# బనకచర్లపై మౌనం ఎందుకు?

- కేంద్రానికి లేఖ రాయని సీఎం.. ఉత్తమ్‌వి ఉత్తుత్తి మాటలు
- మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం
- అఖిలపక్ష సమావేశం పెట్టాలని.. శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని డిమాండ్



**హైదరాబాద్:** ఎటువంటి అనుమతులు లేకుండా ఆంధ్రప్రదేశ్ చేపడుతున్న గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోకుండా కాంగ్రెస్, భాజపాలు మౌనం దాల్చడం వెనుక కారణం ఏంటని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు ప్రశ్నించారు. బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ నివేదికను కేంద్ర జల సంఘం భాగస్వామ్య రాష్ట్రాలకు పంపిందని, ఈ నెలాఖరున ఏపీ టెండర్లు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నా నిలువరించకుండా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రపోతోందని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని భారాస ప్రధాన కార్యాలయం తెలంగాణ భవన్‌లో బనకచర్ల ప్రాజెక్టుతోపాటు పలు అంశాలపై ఆయన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోతిరెడ్డిపాడు ద్వారా కృష్ణా జలాలను తరలించినట్లుగానే బనకచర్లతో గోదావరి జలాల విషయంలో కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.

"కేటీఆర్‌పై కేసులు పెట్టడం, ప్రతిపక్ష నేతలను ఇబ్బందులకు గురిచేయడం, నిత్యం ప్రజల దృష్టిని మళ్లించే రాజకీయాలు చేయడం తప్ప సీఎం రేవంత్‌రెడ్డికి రాష్ట్ర ప్రయోజనాలు పట్టవు. నాడు బాబ్లీ విషయంలో రెండు టీఎంసీల కోసం మహారాష్ట్రతో చంద్రబాబు పోరాటం చేశారు. గోదావరి బోర్డు, ఎపెక్స్ కౌన్సిల్ ఆమోదం లేకుండానే ఏపీ నిర్మిస్తున్న 200 టీఎంసీల అక్రమ ప్రాజెక్టుపై రేవంత్‌రెడ్డి ఎందుకు పోరాటం చేయడం లేదు? పాత దోస్తానాలు, బంధాలు, గురు దక్షిణ కోసం మౌనంగా ఉంటున్నారా? నాడు కాళేశ్వరంతోపాటు పలు ప్రాజెక్టులను అడ్డుకోవాలంటూ ఏపీ ప్రభుత్వం కేంద్రానికి లేఖలు రాసింది. ఇప్పుడు బనకచర్లపై కేంద్రానికి తెలంగాణ సీఎం ఎందుకు లేఖ రాయడం లేదు?

## 8 మంది భాజపా ఎంపీలు ఉండీ ఎందుకు స్పందించడం లేదు?

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌వి ఉత్తుత్తి మాటలే తప్ప చేతలు లేవు. నేను గతంలో ఆరోపణలు చేస్తే పాత తేదీతో లేఖ రాసి విడుదల చేశారు. ఇప్పుడు కూడా నేను ప్రజంటేషన్ ఇవ్వడంతో ముందు రోజు తేదీ వేసి లేఖ రాశారు. గత నెల 23న ఏపీ.. సీడబ్ల్యూసీకి లేఖ రాసింది. కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ మాత్రం తమకు ప్రాజెక్టు వివరాలేవీ రాలేదని కిందటి నెల 28న లేఖ రాశారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి. శాసనసభను సమావేశపరచాలి. తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి. లేదంటే భారాసనే ప్రజాపోరాటానికి దిగుతుంది. న్యాయపోరాటం చేస్తుంది. కాళేశ్వరం రుణాలకు పరిమితి విధించి కోత వేసిన కేంద్రం ఏపీలోని పోలవరానికి నిధులు భరిస్తూనే.. రుణ పరిమితిని ఎత్తివేస్తామని చెప్పింది. తెలంగాణకు ఒక న్యాయం... ఏపీకి ఒక న్యాయమా? రాష్ట్రంలోని ఇద్దరు కేంద్ర మంత్రులు సహా ఎనిమిది మంది భాజపా ఎంపీలు ఉండీ ఎందుకు స్పందించడం లేదు? 200 టీఎంసీల గోదావరి జలాలను బనకచర్లకు తీసుకువెళ్తే ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం ఎగువ రాష్ట్రాలకు వాటా రావాలి. పోలవరం నుంచి మళ్లింపునకు సంబంధించిన వాటా కూడా కలిపితే తెలంగాణకు 157.5 టీఎంసీలు రావాలి కదా... ఎందుకు రాష్ట్రం ప్రశ్నించడం లేదు? కృష్ణా జలాల వినియోగం, పరిరక్షణలోనూ ప్రభుత్వం విఫలమైంది. శ్రీశైలం కుడి ప్రధాన కాలువ లైనింగ్‌ను అడ్డుకోలేక పోతోంది" అని హరీశ్‌రావు విమర్శించారు.

# నూనె శ్రీధర్ కేసులో కూపీ లాగుతున్న ఎసిబి

## ఉన్నతాధికారి ఆదేశాలను బేఖాతర్ చేసినట్లు గుర్తింపు

**హైదరాబాద్, జూన్ 14 :** అక్రమాస్తుల కేసులో అరెస్ట్ అయిన కాళేశ్వరం ఎస్‌ఈసీ నూనె శ్రీధర్ వ్యవహారంలో సంచలన అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. నూనె శ్రీధర్ వ్యవహారంలో మరి కొంతమంది ఇరిగేషన్ అధికారుల పాత్ర ఉన్నట్టుగా ఏసీబీ దర్యాప్తులో బయటపడింది. 2024 జూన్ 27న నూనె శ్రీధర్‌ను ఇరిగేషన్ చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఇరిగేషన్ ప్రిన్సిపాల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా ఆదేశించారు. అయితే ఇరిగేషన్ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఆదేశాలను కూడా నూనె శ్రీధర్ పక్కకు పెట్టినట్లు తెలుస్తోంది. ట్రాన్స్‌ఫర్ అయినప్పటికీ కూడా ఏడాది పాటు చొప్పదండిలోనే ఈఈగా శ్రీధర్ పని చేస్తున్నట్లు ఏసీబీ గుర్తించింది. ఈఎన్‌సీ అనిల్ ఆదేశాల మేరకే శ్రీధర్ అక్కడే పని చేసినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నూనె శ్రీధర్‌కు ఈఎన్‌సీ అనిల్‌కు ఉన్న సంబంధాలపై ఏసీబీ ఆరా తీస్తోంది. ఇరిగేషన్ చీఫ్‌గా ఉండి ప్రిన్సిపాల్ సెక్రటరీ చేసిన ట్రాన్స్‌ఫర్‌ను కూడా ఆపినట్టు- అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో నూనె శ్రీధర్‌ను కస్టడీకి తీసుకుని విచారించాలని ఏసీబీ నిర్ణయించింది. అలాగే ఈఎన్‌సీ అనిల్ పాత్రపైనా ఏసీబీ విచారణ జరిపే అవకాశం ఉంది. అక్రమాస్తుల కేసులో నూనె శ్రీధర్‌ను ఏసీబీ అరెస్ట్ చేయగా.. ఆయన చంచల్ గూడ జైలులో ఉన్నారు. శ్రీధర్‌కు సంబంధించిన అంశాలపై ఏసీబీ అధికారులు చాలా లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఎవరెవరితో సత్సంబంధాలు ఉన్నాయి, ఇరిగేషన్ శాఖ అధికారులతో నూనె శ్రీధర్‌కు ఉన్న సంబంధాలు ఏంటి.. ఇతనికి ఎవరైనా సహకారం అందించారా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఈ సమయంలో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇటీవల శ్రీధర్‌కు సంబంధించి సుమారు 20 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సమయంలో కీలకమైన పత్రాలు, ఆస్తుల చిట్టాను స్వాధీనం చేసుకున్నారు. కొన్ని రోజుల క్రితం ఎంతో గ్రాండ్‌గా శ్రీధర్ తన కుమారుడి వివాహం జరిపించారు. హైదరాబాద్‌లో హల్దీ, సంగీత్ ఫంక్షన్లు నిర్వహించగా.. థాయిలాండ్‌లో వివాహం జరిపించారు. ఇందుకోసం శ్రీధర్ కోట్లు కుమ్మరించినట్లు తెలుస్తోంది. అయితే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న శ్రీధర్‌కు ఇంత భారీ మొత్తంలో ఆస్తులు, ఆదాయం ఎలా సమకూరింది అనే అంశాలపై ఏసీబీ దృష్టి సారించింది.

# సిఎంపై ఫిర్యాదు చేస్తే చర్యలు ఉండవా

## బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**హైదరాబాద్, జూన్ 14 :** తెలంగాణ ప్రభుత్వంతో పాటు రాష్ట్ర పోలీసుల తీరుపై బీఆర్‌ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఫార్ములా ఈ కేసులో సీఎం రేవంత్ రెడ్డి వల్ల రాష్ట్రానికి రావాల్సిన వేలాది కోట్ల రూపాయాల ఆదాయానికి గండి పడిందని నార్సింగి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. కానీ ఇంత వరకు సీఎంపై ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. కనీసం పోలీసులు ఫిర్యాదుదారునైన తనను విచారించకుండానే కేసు క్లోజ్ చేశారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు. సీఎం లేదా హోంమంత్రి మీద కేసు పెట్టకూడదని బీఎన్ఎస్ఎస్ చట్టంలో ఎక్కడైనా ఉందా? అని ఆర్ఎస్పీ ప్రశ్నించారు. ఉల్టా.. చేయని నేరానికి, ఫార్ములా వ్యవహారంలో ఒక తుఫైల్ ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేటీ-ఆర్‌కు నోటీ-సుల మీద నోటీసులు పంపుతున్నారు. ఎక్కడ పడితే అక్కడ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారు. ఇదెక్కడి న్యాయం? సీఎంకు ఒక రూల్.. సామాన్యులకు మరో రూలా..? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిలదీశారు.



# స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటుతుంది

## కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ధీమా

**సిద్దిపేట, జూన్ 14 :** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెదక్ జిల్లాలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ గెలవడం ఖాయమని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ధీమా వ్యక్తం చేశారు. శనివారం గజ్వేల్ మండలం రిమ్మనగూడ వద్ద ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తుంకుంట నర్సారెడ్డి, పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అలాగే సిద్దిపేట రంగదాంపల్లి వద్ద అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు మంత్రి వివేక్ వెంకటస్వామి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వివేక్ వెంకటస్వామి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ శ్రేణులు మెదక్ జిల్లాలో ఇంతటి ఘనస్వాగతం పలకడం తనకు సంతోషంగా ఉందని అన్నారు. సన్నబియ్యం, నూతన రేషన్ కార్డుల మంజూరు వంటి కార్యక్రమాలతో ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై అపూర్వ స్పందన వస్తోందని ఉద్ఘాటించారు. వచ్చే ఎన్నికలనూ దృష్టిలో పెట్టు-కొని గ్రామ గ్రామాల్లో కాంగ్రెస్ జెండా ఎగిరే విధంగా ప్రణాళిక రూపొందించుకొని ముందుకు వెళ్తామని తెలిపారు. కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దామని అన్నారు. విభేదాలను పక్కన పెట్టి సమస్యలు పరిష్కారం చేసుకుందామని కోరారు. సిద్దిపేటలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని మాటిచ్చారు. ఇచ్చిన హామీలను నెరవేర్చుకుందాం, వారానికి ఒక్కసారి సిద్దిపేటకి వస్తానని మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు.

# వరుసగా రెండోరోజూ ఎఐజి ఆస్పత్రికి కెసిఆర్

## జలుబు తదితర కారణాలతో వైద్య పరీక్షలు



**హైదరాబాద్, జూన్ 14 :** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రికి వైద్య పరీక్షల కోసం వెళ్లారు. గత కొంత కాలంగా జలుబుతో బాధపడుతున్న కెసిఆర్ ఆరోగ్య పరీక్షల కోసం శనివారం ఉదయం ఏఐజీ ఆస్పత్రికి వెళ్లారు. ఆయన వెంట కుటుంబసభ్యులు, మాజీ మంత్రి హరీష్ రావు, తదితరులు ఉన్నారు. శుక్రవారం కూడా ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకున్న కెసిఆర్ మరోసారి ఆస్పత్రికి వెళ్లారు. వైద్య పరీక్షలు పూర్తి అయిన తర్వాత నందీనగర్‌లోని నివాసానికి వెళ్లనున్నారు. ఐదు రోజుల పాటు- నందీనగర్ నివాసంలో కేసీఆర్ ఉండనున్నారు. ప్రతీ రెండు నెలలకు ఒకసారి కేసీఆర్ ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటారు. గతంలో యశోదా ఆస్పత్రికి కేసీఆర్ తరచుగా వెళుండేవారు. అయితే ఈసారి గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి వెళ్లారు. నిన్న సాయంత్రం ఎర్రవల్లి ఫాంహౌస్‌లోని ఆయన నివాసం నుంచి హైదరాబాద్ వచ్చిన కేసీఆర్.. ఏఐజీ ఆస్పత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించారు. మళ్లీ ఈరోజు కూడా రావాల్సిందిగా వైద్యులు సూచించారు. వైద్యుల సూచనల మేరకు నేడు ఆస్పత్రికి వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. గడిచిన ఏడాదిన్నర కాలంగా కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్‌లోని ఆయన నివాసంలోనే ఉంటు-న్నారు. అందుబాటు-లో ఉండాలని వైద్యులు చెప్పిన నేపథ్యంలో బంజారాహిల్స్‌లోని నందినగర్‌లోనే ఉండనున్నారు. ఇక కాళేశ్వరం కమిషన్ విచారణకు ఈనెల 11న మాజీ సీఎం హాజరైన విషయం తెలిసిందే. ఆ సమయంలో కూడా తనకు జలుబు ఉందని కమిషన్ ఛైర్మన్ పీసీ ఘోష్‌కు చెప్పారు. ఓపెన్ కోర్టులో విచారణ వద్దని కేసీఆర్ కోరగా.. ఆయన వినతిని పరిగణలోకి తీసుకున్న కమిషన్ ఛైర్మన్ బహిరంగ విచారణను రద్దు చేశారు. ఇండోర్‌లోనే కేసీఆర్‌ను కమిషన్ ముఖాముఖిగా విచారించింది. ఇక అప్పటి నుంచి కూడా అనారోగ్యంతో కేసీఆర్ బాధపడు తున్నారు. ఈ క్రమంలో వైద్యపరీక్షల నిమిత్తం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి మాజీ సీఎం కేసీఆర్ వెళ్లారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంపై బిజెపికి ప్రేమ

## మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి విమర్శలు



**హైదరాబాద్, జూన్ 14 :** కాంగ్రెస్, బిజెపిపై బిఆర్ఎస్ మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఫైరయ్యారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ముల్లుకుచ్చుకుంటే.. రాష్ట్ర బిజెపి నేతలకు నొప్పిలేస్తుందని అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రాజెక్టులలో జరుగుతున్న నష్టాల మీద రాష్ట్ర బిజెపి నేతలు, ప్రజా ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. ప్రాజెక్టుల్లో నష్టాలపై ఎలాంటి కమిషన్లు వేయదని.. విచారణ కూడా చేయదన్నారు. శ్రీశైలం సొరంగం కూలినా.. సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలినా.. వట్టెం పంప్ హౌస్ మునిగినా.. కేంద్రం ఎందుకు కమిషన్లు పంపడం లేదని మాజీ మంత్రి ప్రశ్నించారు. వాటి మీద విచారణకు రాష్ట్ర బిజెపి నేతలు ఎందుకు డిమాండ్ చేయరని నిరంజన్ రెడ్డి నిలదీశారు.

# విమాన ప్రమాద ఘటనపై ఐదుగురితో కమిటీ

- వివిధ రంగాల నిపుణులతో ఉన్నతస్థాయి దర్యాప్తు
- బ్లాక్‌బాక్స్ విశ్లేషించాక అసలు విషయాలు గుర్తింపు
- భవిష్యత్‌లో ప్రమాదాలు జరక్కుండా లోతుగా అధ్యయనం
- కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

**న్యూఢిల్లీ, జూన్ 14 :** అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన దుర్ఘటనను పౌర విమానయాన శాఖ అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. విమానయాన భద్రతపై శనివారం ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ప్రమాదం జరిగిన వెంటనే ఘటనాస్థలిలో సహాయచర్యలు చేపట్టినట్లు తెలిపారు. గుజరాత్ ప్రభుత్వం, పౌరవిమానయాన శాఖ సంయుక్తంగా స్పందించినట్లు పేర్కొన్నారు. ఘటన జరిగిన వెంటనే మంటలార్పి.. మృతదేహాలను అక్కడి నుంచి తరలించాం. దుర్ఘటనపై విచారణకు తక్షణమే ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశాం. అవసరమైతే మరికొంత మంది సభ్యులనూ బృందంలో చేరుస్తాం. శుక్రవారం సాయంత్రం ఘటనాస్థలిలో బ్లాక్స్‌బాక్స్ దొరికింది. దానిని విశ్లేషించిన తర్వాత ఏం జరిగిందనేది పూర్తిగా తెలుస్తుందని అన్నారు. అందులో ఏముందో తెలుసుకునేందుకు మేమూ ఆతృతగా ఎదురుచూస్తున్నాం. దుర్ఘటనలో మరణించిన వారి కుటుంబాల బాధను అర్థం చేసుకోగలను. నా తండ్రి కూడా ప్రమాదంలోనే మరణించారు. ఆ బాధ నాక్కూడా తెలుసు.




### ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు

హోంశాఖ సెక్రెటరీ ఆధ్వర్యంలో మరో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశాం. ప్రత్యేక అధికారులతో, వివిధ రంగాలకు చెందిన నిపుణులతో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేశాం. సంపూర్ణ దర్యాప్తు జరిపేందుకు ఈ కమిటీ సభ్యులు దోహదపడతారు. నిపుణుల విచారణ పూర్తయ్యాక తగిన సమయంలో మీడియాకు సమాచారమిస్తాం. రెండు నెలల్లోగా విచారణ పూర్తవుతుందని భావిస్తున్నాం. అంతేకాకుండా బోయింగ్ 787 సిరీస్‌ను తరచూ తనిఖీలు చేయాలని ఆదేశించాం అని రామ్మోహన్ నాయుడు మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. విమాన ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు సంతాపం వ్యక్తం చేశారు. గడిచిన రెండు రోజులు భారంగా గడిచిందని.. ప్రమాదంలో ఎవరైనా చనిపోతే ఆ కుటు-ంబం అనుభవించే బాధ తనకు ప్రత్యేకంగా తెలుసన్నారు. విమాన ప్రమాదం జరిగిన వెంటనే నేను సంఘటనా స్థలానికి చేరుకుని చర్యలు చేపట్టాం. ప్రమాదం స్థలాన్ని పరిశీలించాను. గుజరాత్ ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టింది. పౌర విమానయాన శాఖ ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుందన్నారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మెడికల్, ఫోరెన్సిక్, టీమ్‌లతో పాటు ఐదుగురితో ఏఐబీ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. బ్లాక్ బాక్స్‌ను ఇప్పటికే స్వాధీనం చేసుకున్నామని... అందులో ఉన్న సమాచారం కీలకంగా మారనుందని తెలిపారు. బ్లాక్ బాక్స్‌లో ఉన్న సమాచారం రానున్న రోజుల్లో కీలకమని చెప్పుకొచ్చారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి చైర్మన్ నేతృత్వంలో కమిటీ- వేసినట్లు- తెలిపారు. హోంశాఖ కార్యదర్శి, సివిల్ ఏవియేషన్ సెక్రటరీ, గుజరాత్ అధికారులు, పోలీసు కమిషనర్ అహ్మదాబాద్, స్పెషల్ డైరెక్టర్ ఐబీని ఈ కమిటీలో నియమించినట్లు చెప్పారు. విమానాశ్రయం నుంచి 2 కి.మీ దూరం వెళ్లిన తర్వాత.. 650 అడుగుల ఎత్తులో ఉన్నప్పుడే విమానం కూలిపోయినట్లు- పౌరవిమానయాన శాఖ కార్యదర్శి తెలిపారు. అహ్మదాబాద్ ఏటీసీకి పైలట్ మేడే కాల్ ఇచ్చారు. విమాన సిబ్బందిని ఏటీసీ సంప్రదించినా స్పందన రాలేదు. ప్రమాదం జరిగిన వెంటనే సహాయబృందాలు ఘటనాస్థలికి చేరాయి. రెండు గంటల్లో ఉన్నతాధికారుల బృందమంతా ఘటనాస్థలికి చేరుకుంది. గుజరాత్ ప్రభుత్వం తక్షణమే స్పందించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించింది.సాయంత్రం 6 గంటలయ్యేసరికి అగ్నిమాపక శాఖ మంటలార్పేసింది. ఎస్‌వోపీ ప్రకారం.. తక్షణమే విచారణకు ఆదేశాలు ఇచ్చాం అని ఆయన వివరించారు. అహ్మదాబాద్‌లో ఈనెల 12న జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటన యవత్ దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ప్రమాదంలో మొత్తం 241 మంది ప్రాణాలు కోల్పోగా.. ఒక్కరు మాత్రం మృత్యుంజయుడిగా నిలిచాడు.

## కాళేశ్వరం ముందు అంతా
# కాకమ్మ కబుర్లు

- అంచనాలు పెంచడంపై కమిషన్ నిజాలు రాబట్టాలి
- మాజీ ఎమ్మెల్సీ ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్

**హైదరాబాద్, జూన్ 14 :** కాళేశ్వరంపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట విచారణకు ఇటీవల హాజరైన వ్యక్తులు.. క్యాబినెట్ నిర్ణయం మేరకే అంతా జరిగిందని చెప్పారని భాజపా నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. తప్పించుకోవడానికే ఇలా కాకమ్మ కథలు చెప్పారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ బహిరంగ విచారణ వద్దని అనడంలోనే అసలు ఉద్దేశం తెలుస్తోందన్నారు. బండారం బయట పడుతుందని అలా అడిగారని చెప్పారు. అప్పటి సీఎం కేసీఆర్ తప్పులు జరుగుతున్నా సరిచేయలేదని దుయ్యబట్టారు. కాళేశ్వరం బ్యారేజీలు కుంగిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నిం చారు. తమ్మిడిహట్టి నుంచి ప్రాజెక్ట్ లొకేషన్‌ను రాజకీయ కారణాలతోనే మార్చారు. అంచనాలు పెంచ డంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమాధానాలు రాబట్టాల న్నారు. గత ప్రభుత్వ అవినీతిని బయట పెట్టాల ని కాంగ్రె స్ ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదు. షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయం అని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు.




## విమాన ప్రమాదాలు పునరావృతం అప్రమత్తం

- అంతర్గత ఆడిటింగ్‌లు.. ప్రత్యేక తనిఖీలు
- ఎయిరిండియా బోర్డు నిర్ణయం

**న్యూఢిల్లీ, జూన్ 14 :** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదం ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై యావత్ ప్రపంచం దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోంది. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఎయిరిండియా బోర్డు అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. తమ అన్ని విమానాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు- సంబంధిత వర్గాలు వెల్లడించాయి. విమాన ప్రమాదంలో 274 మంది ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో అంతర్గత ఆడిట్ నిర్వహించాలని ఎయిరిండియా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. విమానాల కండీషన్, వాటి నిర్వహణ పద్ధతులు, ఇలా వివిధ శాఖలపై సమీక్ష కూడా చేయించడంపై ఎయిరిండియా ఛైర్మన్, సీఈవో సిద్ధమయ్యారు. భద్రతా ఆడిట్ నిర్వహణకు ఎయిరిండియా బోర్డును ఆదేశించారని తెలుస్తోంది. అంతేకాకుండా ఈ ఘటనపై మరో విచారణ చేపట్టనుంది. ఉద్యోగుల నైపుణ్యాలను మెరుగుపరచడం, వారిని సమగ్ర శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించడంపై దృష్టి పెట్టింది. విమాన ప్రమాదంపై అన్ని దర్యాప్తు సంస్థలకు సహకరిస్తామని ఎయిరిండియా పేర్కొంది. కాగా.. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా ఫ్లయిట్ నెంబర్ ఏఐ-171 విమానం ఇటీ-వల కూలిపోయిన సంగతి తెలిసిందే. రన్‌వే నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ప్రమాదానికి గురైంది. మేఘాని నగర్ ఘోడాసర్ క్యాంప్ ప్రాంతంలో విమానం ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ప్రమాదంలో 274 మంది మృతి చెందారు. అయితే.. ఈ ప్రమాదంపై స్వయంగా దర్యాప్తు చేపట్టేందుకు ఎయిరిండియా సిద్ధమైంది. ఇలాంటి ప్రమాదాలను నివారించేందుకు సమగ్ర తనిఖీలు చేపడుతోంది.

# కాళేశ్వరం ఓ పనికిరాని ప్రాజెక్ట్

- దాని కోసం డబ్బులు వృధా చేయరాదు
- అన్నీ తానే అన్న కెసిఆర్ ఇప్పుడు కేబినేట్ అంటున్నారు
- విమర్శలు గుప్పించిన సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని

**హన్మకొండ, జూన్ 14 :** ప్రజాధనాన్ని ఇకపై కాళేశ్వరం కోసం ఖర్చు చేయొద్దని సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఈ మేరకు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనికిరాదని, దాన్ని పూర్తిగా రద్దు చేయాలని అన్నారు. కూనంనేని మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరానికి అన్నీ తానే అన్న మాజీ సిఎం కెసిఆర్ ఇప్పుడు సంబంధం లేదంటున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం నిర్మించాక ఒక్క ఎకరాకు అదనంగా నీళ్లు ఇవ్వలేదని, ఎల్లంపల్లి ద్వారానే పంటలకు నీళ్లు అందుతున్నాయని తెలియజేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పనికిరాదని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల సొమ్మును ఇకపై కాళేశ్వరం కోసం ఖర్చు చేయొద్దని సూచించారు. కేసీఆర్ అంటే కాళేశ్వరం.. కాళేశ్వరం అంటే కేసీఆర్ అన్నోళ్లు ఇప్పుడు నోరు మూసుకున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో అన్నీ తానే అన్న కేసీఆర్ ఇప్పుడు తనకు సంబంధం లేదని ఎందుకు అంటున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. మహారాష్ట్ర పర్మిషన్ ఇవ్వలేదని మాజీ మంత్రి హరీష్‌రావు అంటున్నారని చెప్పారు. గతంలో 140మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్ట్ కట్టాలని తాము డిమాండ్ చేశామని గుర్తుచేశారు. కాళేశ్వరం నిర్మించాక ఒక చుక్కనీరు అదనంగా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. పంటలకు వచ్చేవి ఎల్లంపల్లి నీళ్లేనని స్పష్టం చేశారు కూనంనేని సాంబశివరావు. కేంద్రప్రభుత్వం మానవ హక్కులను ఉల్లంఘిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.




మావోయిస్టుల మృతదేహాలను చూసి కూడా కేంద్రం భయపడుతోందని, మృతదేహాన్ని అప్పగించకపోవడం దారుణమని కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితఎపిసోడ్ ఇప్పుడు రాజకీయాల్లో ఒక కొత్త చర్చకు దారితీసింది. తాజాగాకూనంనేని సాంబశివరావు షాకింగ్ కామెంట్స్ చేశారు. కవిత ప్రకటనతో బీఆర్ఎస్, బీజేపీ పార్టీల మధ్య ఉన్న రహస్య ఒప్పందం బయటపడిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ షర్మిల స్థితిగతులు ఎలా ఉన్నాయో.. తెలంగాణలో కవిత పరిస్థితి కూడా అలాగే ఉందని ఆయన విమర్శించారు. పేదలు లేని దేశంగా ఇండియాని చూపాలని మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. నెలకు రూ.8 వేల ఆదాయం ఉంటే ధనికులు ఎలా అవుతారని ప్రశ్నించారు. పేదలను మోదీ ప్రభుత్వం దగా చేస్తోందని ఫైర్ అయ్యారు. నెలకు రూ. 20వేల ఆదాయం ఉన్నా కూడా పేదవారిగానే పరిగణించాలని కూనంనేని సాంబశివరావు కోరారు.

## 42శాతం బిసి రిజర్వేషన్లతోనే
# స్థానిక ఎన్నికలకు పోవాలి

- సామాజిక తెలంగాణ కోసం విద్యార్థులు పోరాడాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

**హైదరాబాద్, జూన్ 14 :** బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తే ఊరుకోబోమని రేవంత్ సర్కారును ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. తెలంగాణ జాగృతి స్టూడెంట్ ఫెడరేషన్‌లో పెద్ద సంఖ్యలో చేరారు. వారికి కండువా కప్పి తెలంగాణ జాగృతిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజిక తెలంగాణ సాధనకు విద్యార్థి లోకం కదిలిరావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు ముందు వరుసలో ఉండి కొట్లాడారని.. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించారన్నారు. అదే స్ఫూర్తితో సామాజిక తెలంగాణ సాధన ఉద్యమంలో విద్యార్థులు ముందు వరుసలో ఉండాలని.. సామాజిక తెలంగాణను సాధించడానికి విద్యార్థులు నడుం బిగించాలన్నారు. బీసీ బిల్లులు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండగానే.. స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్న ఆలోచన సరికాదన్నారు. బీసీలకు 42 రిజర్వేషన్లకు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కర్నాటకలో కులగణన ఎలా చేయాలో అక్కడి సీఎం సిద్ధరామయ్యకు నేర్పించానని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకుంటున్నారని.. సీఎం ఈ ప్రకటన చేసిన గంట సేపటికే కాంగ్రెస్ అధికారికంగా ఒక ఫొటో విడుదల చేసిందని.. ఆ ఫొటోలో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఉన్నారని.. రేవంత్ రెడ్డి మాత్రం లేరన్నారు. దీన్ని బట్టే రేవంత్ రెడ్డి ఎన్ని అబద్దాలు ఆడుతున్నారో అర్థమవుతుందన్నారు. రాహుల్ గాంధీ దర్శనం లేక సీఎం రేవంత్ రెడ్డి విలవిలలాడుతున్నారని.. దర్శనాల సంగతి పక్కనబెట్టి ప్రజా సమస్యలపై



సీఎం దృష్టిపెట్టాలని సూచించారు. ఆర్ఎస్ఎస్ స్కూల్, టీడీపీ కాలేజీలో చదువుకున్నానని.. జాబ్ కాంగ్రెస్ లో చేస్తున్నానని సీఎం అన్నారని.. చేస్తున్న జాబ్‌లో కూడా రేవంత్ రెడ్డికి పాస్ మార్కులు రావడం లేదని ఎద్దేవా చేశారు. ఢిల్లీకి వెళ్లడంలో రేవంత్ రెడ్డి హాఫ్ సెంచరీ చేశారని.. కనీసం మంత్రివర్గాన్ని కూర్పు చేసుకోలేని సీఎం రేవంత్ రెడ్డి అని.. ఇంత అసమర్థ, బలహీన ముఖ్యమంత్రిని గతంలో ఎప్పుడూ చూడలేదని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో చివరి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి కూడా ఇంత బలహీనంగా లేకుండేనని.. తెలంగాణ ఆత్మగౌరవాన్ని రేవంత్ రెడ్డి ఢిల్లీలో తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలు, విద్యారంగ పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని.. దాదాపు రూ. 8వేల కోట్ల మేర ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిలు ఉన్నాయని.. తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. విద్య భరోసా కార్డులు పంపిణీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని విస్మరిస్తోందని.. తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం మెరుపులా పనిచేయాలని సూచించారు.

## ఐదో అంతస్థు నుంచి దూకి మహిళ ఆత్మహత్య

### కుటుంబ కలహాలే కారణమంటున్న పోలీసులు

**హైదరాబాద్, జూన్ 14 :** సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఎర్రగడ్డలోని జనప్రియ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న ఓ మహిళ 5వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు- పోలీసులు తెలిపారు. శనివారం ఉదయం 8:30 గంటల సమయంలో ఈ సంఘటన జరిగింది. పోలీసులు ఇచ్చిన సమాచారం ప్రకారం... ఆత్మహత్య చేసుకున్న మహిళ పేరు కొక్కినీ శ్రావణి (30), ఆమె తిమ్మాపురం, ఏలూరు జిల్లా వాసిగా గుర్తించారు. . కొద్ది నెలల క్రితమే హైదరాబాద్‌కు వలసవచ్చి, జనప్రియ అపార్ట్‌మెంట్‌లో హౌస్ కీపింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నట్టు- తెలుస్తోంది. ఆమెకు రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. కుటుంబ కలహాలే ఆమె ఆత్మహత్యకు కారణమై ఉంటాయని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్టు- పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ సంఘటనతో అపార్ట్‌మెంట్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## జగన్‌తో మిలాఖత్ అయి
# కృష్ణా జలాల దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తున్నాం. జనవరి 22న కేంద్ర జలశక్తి, ఆర్థికశాఖ మంత్రులకు లేఖ రాశాను. ఆ ప్రాజెక్టుపై అభ్యంతరాలు తెలిపాను. బనకచర్ల ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ మౌనం వహించలేదు. చట్టపరంగా ముందుకెళ్తున్నాం. హరీశ్‌రావు వాదనలు నిరాధారం, తప్పుదారి పట్టించేలా ఉన్నాయని మండిపడ్డారు. నదీ జలాల హక్కులపై తెలంగాణకు నష్టం చేసింది బీఆర్ఎస్సేనని ఆరోపించారు. పదేళ్ల పాలనా కాలంలో కృష్ణానది వాటాను కేవలం 299 టీఎంసీలకే పరిమితం చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే ముచ్చుమర్రి, మాల్యాల నుంచి నీటిని తరలించారు. రాయలసీమ ఎత్తిపోతలపై అపెక్స్ కౌన్సిల్‌ను మీరెందుకు సంప్రదించలేదు. ఏపీ..రోజూ 3 టీఎంసీలు మళ్లిస్తోంటే కేసీఆర్ చోద్యం చూశారు. జగన్, కేసీఆర్ మధ్య అవగాహనతోనే తెలంగాణ నీటిని ఏపీకి దోచిపెట్టారని ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఇవన్నీ కప్పిపుచ్చి బనకచర్ల ప్రాజెక్టు గురించి బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు చేసిన ఆరోపణలను చేయడాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తోసిపుచ్చారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తున్నామని ఆయన అన్నారు. జనవరి 22న కేంద్ర జలశక్తి, ఆర్థికశాఖ మంత్రులకు లేఖ రాశానని.. బనకచర్ల ప్రాజెక్టుపై అభ్యంతరాలు తెలిపినట్లు- పేర్కొన్నారు. బనకచర్ల ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ మౌనం వహించలేదని.. ప్రాజెక్టుపై చట్టపరంగా ముందుకెళు తున్నామని తెలిపారు. ఈ విషయంలో హరీశ్‌రావు వాదనలు నిరాధారం, తప్పుదారి పట్టించేలా ఉన్నాయని ఉత్తమ్ మండిపడ్డారు.

## ముగ్గురు మంత్రులకు ఛాంబర్ల కేటాయింపు

### త్వరలోనే అధికారిక విధుల్లోకి మంత్రులు

**హైదరాబాద్, జూన్ 14 :** తెలంగాణ మంత్రివర్గంలో కొత్తగా చేరిన మంత్రులకు సచివాలయంలో చాంబర్ల ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ జీఏడీ చాంబర్ల కేటాయింపుపై ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల మంత్రివర్గంలోకి తీసుకున్న అడ్లూరి లక్ష్మణ్‌కు సచివాలయ మొదటి అంతస్తులో 13, 14, 15, 16 నంబర్ గదులు కేటాయించగా, మంత్రి వివేక్ వెంకటస్వామికి రెండో అంతస్తులో 20, 21, 22 నంబర్ గదులు లభించాయి. వాకిటి శ్రీహరికి రెండో అంతస్తులోనే 26, 27, 28 నంబర్ గదులు కేటాయించారు. ఇప్పుడు చాంబర్లు కేటాయింపుతో వీరు త్వరలోనే తమ శాఖల అధికారిక బాధ్యతలను స్వీకరించనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే వారికి శాఖల కేటాయింపులు కూడా పూర్తయ్యాయి. అడ్లూరి లక్ష్మణ్‌కు ఎస్సీ అభివృద్ధి, గిరిజన, మైనారిటీ- సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారత వంటి సామాజిక రంగాలకు సంబంధించిన కీలక శాఖలు అప్పగించగా, వివేక్ వెంకటస్వామికి కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు, మైనింగ్, జియాలజీ వంటి పారిశ్రామిక రంగాల శాఖలు లభించాయి. వాకిటి శ్రీహరికి పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, క్రీడలు, యువజన సేవల శాఖలు కేటాయించారు. ఈ నేపథ్యంలో సచివాలయంలో వీరికి కేటాయించిన కొత్త కార్యాలయాలు త్వరలో బిజీగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. కొత్త మంత్రులతో కార్యాలయాల్లో కార్యకలాపాలు ఊపందుకునే అవకాశం ఉంది.

## మధ్యప్రదేశ్‌లో ఎన్‌కౌంటర్

### నలుగురు మావోయిస్టులు మృతి

**భోపాల్, జూన్ 14 :** మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నారని పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. బాలాఘాట్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారంటూ నిఘా వర్గాల నుంచి పోలీసులు, భద్రతా దళాలకు సమాచారం అందింది. దీంతో ఆ అటవీ ప్రాంతంలో వారు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహించారు. ఆ క్రమంలో భద్రతా బలగాలను మావోయిస్టులు గమనించడంతో.. వారిపైకి కాల్పులకు తెగబడ్డారు. దీంతో భద్రతా బలగాలు వెంటనే ఎదురు కాల్పులు జరిపాయి. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు నిరంతరాయంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఆ క్రమంలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో వందల మంది మావోయిస్టులు మృతి చెందారు. వారిలో అగ్రనేతలు సైతం ఉన్నారు. అయితే ఈ కూబింగ్‌ను తట్టు-కోలేక కొందరు మావోయిస్టులు సరిహద్దు రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లోని పలు జిల్లాలోకి మావోయిస్టులు ప్రవేశించారంటూ నిఘా వర్గాల వద్ద స్పష్టమైన సమాచారం ఉన్నట్లు- తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ యా జిల్లాల్లో భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఇంకోవైపు 2026, మార్చి మాసాంతానికి దేశంలో మావోయిస్టులను నిర్మూలిస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టమైన ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో వారి నిర్మూలన కోసం కేంద్రం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అయితే తాము చర్చలకు సిద్ధమని ఈ నేపథ్యంలో ఆపరేషన్ కగార్ ఆపాలంటూ మవోయిస్టులు చేసిన విన్నపాన్ని అటు- కేంద్ర ప్రభుత్వం కానీ ఇటు- ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కానీ పరిగణలోకి తీసుకోకపోవడం గమనార్హం.

## చేవెళ్లలో ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు

### కూల్చేసిన రెవెన్యూ సిబ్బంది

**హైదరాబాద్,జూన్14 :** గ్రేటర్ హైదరాబాద్ లో ఓ వైపు హైడ్రా,మరో వైపు రెవెన్యూ,జీహెచ్ఎంసీ అధికారులు అక్రమ నిర్మాణాలపై కొరడా ఝులిపిస్తున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన కట్టడాలను రెవెన్యూ అధికారులు నేలమట్టం చేస్తున్నారు. కొన్ని చోట్ల పర్మిషన్ లేకుండా ఇష్టారాజ్యంగా భవనాలు,బిల్డింగ్ లు కడుతున్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. షాబాద్ మండల పరిధిలో హైతాబాద్ గ్రామం రెవెన్యూలోని సర్వే నెంబర్ 8 లో 42 ఎకరాల ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను తొలగించారు షాబాద్ ఎమ్మార్వో, అధికారులు. ఇష్టానుసారంగా హైతాబాద్ లో ఉన్నటువంటి బడా నాయకులు డబ్బుల కోసం వేరే వ్యక్తులకు షాపులు వేసుకొని నెలసరి మామూలు ఇవ్వాలని డిమాండ్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం అధికారులకు తెలియడంతో అధికారులు ప్రభుత్వ భూములలో అక్రమ కట్టడాలను జేసీబీ సాయంతో తొలగించారు. ఇలాంటివి జరగకుండా అక్రమ నిర్మాణాలను అరికట్టాలని గ్రామస్తులు ప్రభుత్వ అధికారులను కోరారు. నాలాలు ఆక్రమించి, ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా వెలిసిన నిర్మాణాల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గత కొన్ని రోజుల నుంచి జీహెచ్ఎంసీ, రెవెన్యూ, హైడ్రా వీటిపైనే ఫోకస్ పెట్టింది. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోంది.

## విమాన ప్రమాద బాధితులకు 25లక్షల తక్షణ సాయం

**న్యూఢిల్లీ,జూన్14 :** విమాన ప్రమాద బాధితులకు ఎయిర్ ఇండియా సంస్థ తక్షణ ఆర్థిక సాయం ప్రకటించింది. మధ్యంతర సాయం కింద బాధితులకు రూ.25 లక్షలు ఇవ్వనున్నట్టు ప్రకటించింది. బాధితులకు గతంలో టాటా సన్స్ ప్రకటించిన రూ.కోటి ఆర్థిక సాయానికి ఇది అదనమని పేర్కొంది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఎయిర్ ఇండియా పోస్టు పెట్టింది. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు తాము అన్ని రకాలుగా అండగా ఉంటామని ఎయిర్ ఇండియా పేర్కొంది. బాధిత కుటుంబాలకు సాయం కోసం క్షేత్రస్థాయిలో తమ బృందాలు కృషి చేస్తున్నాయని తెలిపింది. ఇందులో భాగంగానే మధ్యంతర ఆర్థిక సాయం ప్రకటించినట్టు వెల్లడించింది. ప్రమాద ఘటన తమను ఎంతో కలచివేసిందని పేర్కొంది.

జనశక్తి

# విమానయాన రంగం పురోగమించాలి!



అహ్మదాబాద్ విమాన దుర్ఘటన నుంచి మనం ఎన్నో పాఠాలు నేర్చుకోవాల్సి ఉంది. ప్రధానంగా సాంకేతికంగా మరింత నైపుణ్య సాధించాలి. విమానయాన రంగంలో నైపుణ్యాలకు పెద్దపీట వేయాలి. విమనాలు బయలుదేరే ముందు కనీసం దాని సామర్థ్యం, లోపాలను పరిశీలించి ఓకే చేసిన తరవాతనే ప్రయాణానికి అనుమతి ఇవ్వాలి. ఇప్పటి వరకు అలాగే జరుగుతున్నా తాజా ఘటనతో లోపాలను వెలికి తీయాలి. అలాగే ఎయిరిండియా విమానం కూలడానికి రెండు ఇంజిన్లు ఫెయిల్ అయ్యాయని అంటున్నారు. అది ఢిల్లీ నుంచి బయలుదేరి వచ్చిందని అంటున్నారు. అలాంటప్పుడు ఈ ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై లోతుగా విశ్లేషణ చేయాలి. ఇకపోతే విమానయానరంగ నిపుణులను తయారు చేసుకునే అవసరం ఇప్పుడు వచ్చింది. ఈ రంగంలో ఇంజనీర్లయిన నిపుణుల కొరత ఉన్నట్లు తెలుస్తోంది. 146 కోట్లు ఉన్న దేశ జనాభాకు తగ్గట్లుగా ఇప్పటికీ విమానాలు లేవు. ఉన్నకొద్ది విమానాలు సామాన్యుల అవసరానికి అనుగుణంగా లేవు. ఇంకా విమానాశ్రయాలు నిర్మించాల్సి ఉంది. స్పీడ్ యుగంలో ప్రజలకు విమానయాన ప్రయాణం అందుబాటులోకి రావాలి. నాణ్యమైన సేవలు అందించేలా ఈ రంగాన్ని తీర్చిదిద్దాలి. ఇవన్నీ తర్కిస్తూ...తాజా ప్రమాద ఘటనపై విశ్లేషణ చేయాలి. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై నిపుణులతో చర్చించాలి. ఈ ఘటన ఎందుకిలా జరిగిందో లోతుగా అధ్యయనం చేయాలి. నిజానికి అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన ఒళ్ళు జలదరింపచేస్తోంది. ఆ పెనువిషాదం గుండెలను పిండేస్తున్నది. వందల కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. ఎందరో కలలను చిదిమేసింది. ఎయిరిండియా తప్పిదానికి వందలాది ప్రాణాలు గాల్లో కలిసి పోయాయి. అలవోకగా సముద్రాలను అధిగమించి, సునాయాసంగా వేలాదికిలోమీటర్లు దూసుకుపోవాల్సిన ఈ విమానం నేలకూలడంతో బతుకలు ఛిద్రం అయ్యాయి. నిత్యం వదదలాది విమానాలు క్షేమంగా గమ్యం చేరుస్తున్నాయి. వేలాది మంది తమ గమ్యాన్ని చేరుకుంటున్నారు. ఇలా ఎన్నో కలలతో తమ గమ్యానికి చేరుకుంటామన్న వారి జీవితాలు బుగ్గిగా మారాయి. ఎన్నో ఆశలు, ఆశయాలతో బయలుదేరిన వారంతా అర్థంతరంగా జీవితం చాలించారు. ఇందులో మరో విషాదమేమంటే ఏమీ తెలియని వైద్యవిద్యార్థులు భోజనానికి కూర్చున్న సమయంలో అనుకోని ప్రమాదం పిడుగులా దూసుకువచ్చిపడింది. దీంతో దాదాపు 33మంది మృతి చెందారని అంటున్నారు. నిజంగా వీరికోసం ఎందరో తల్లదండ్రులు కలలుకన్నారు. ఈ ప్రమాంతో ఇప్పటి వరకు 274మంది మృత్యువాత పడ్డారు. మరికొందరు ఇంకా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరంతా అతివిషాదంగా తమ జీవితాన్ని ముగించాల్సివచ్చింది.

మహాశక్తిమంతమైన ఇంజన్లు కలిగిన , అత్యాధునిక సాంకేతిక వ్యవస్థలు ఉన్న టాటాలు నడుపుతున్న విమానం లండన్‌లో నిక్షేపంగా దిగడానికి బదులు వందల అడుగులు లేవకుండానే కూలిన ఘటన మనకు గుణపాఠం కావాలి. మొత్తం విమానయాన రంగాన్ని ఆత్మపరిశీలనచేసుకోవాలి. విమనాల ఉత్పత్తి మొదలు సాంకేతకిత వరకు అన్నీ సమగ్ర అధ్యయనం చేయాలి. మాటలకు అందని మహావిషాదం ఇది. పట్టుమని తొమ్మిదివందల అడుగులు కూడా లేవలేక విమానం కుప్పకూలింది. విమాన ప్రమాదాల్లో సగానికి పైగా టేకాఫ్, లాండింగ్ సందర్భాల్లోనే జరుగుతాయి. తొలుత పక్షి ఢీకొన్నదేమోనన్న అనుమానాలూ ఉన్నాయి. టేకాఫ్ సక్రమంగా జరగలేదని, అందుకు తగినంత శక్తి సమకూరలేదని అర్థమవుతూనే ఉంది. ట్యాంక్ నిండా ఇంధనం ఉన్నా, సరఫరా వ్యవస్థల్లో లోపం ఉంటే, ఇంధనం సరిగా చేరక ఇంజన్ విఫలమవుతుంది. ఇంజన్ మీద అత్యంత భారం పడే టేకాఫ్ సందర్భం పైలట్ల నైపుణ్యానికీ, అనుభవానికీ కూడా ఓ విషమపరీక్ష. నిండుగా ఉన్న ఇంధనం నిక్షేపంగా గమ్యానికి చేర్చాల్సింది పోయి విమానం మొత్తం క్షణాల్లో భగ్గున మండేలా తోడ్పడింది. ఆ విమానం వైద్యవిద్యార్థుల హాస్టల్ మీద పడి, అనేక మంది ప్రాణాలు తీసింది. సమగ్ర పరీక్షలు చేయనిదే, ప్రయాణానికి నూరుశాతం అర్హమైనదని నిర్ధారణ కానిదే ఏ విమానమూ గాలిలోకి ఎగరదు. అత్యంత అనుభవజ్ఞులైన పైలట్, కోపైలట్‌కు ఏ మాత్రం అనుమానం కలిగినా ఈ ప్రయాణానికి అంగీకరించేవారే కాదు. ఇంతటి ఘోర ప్రమాదం జరిగిన తరువాత, మొత్తంగా బోయింగ్‌మీద, ప్రత్యేకించి ఈ తరహా విమానాలమీద అనుమానాలు ప్రచారంలోకి రావడం సహజం. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో ఈ విమానాలు నిక్షేపంగా తిరుగుతున్నాయి.

ఎయిర్ ఇండియాను కొనుగోలు చేసిన సందర్భంలో టాటా సంస్థకు సంక్రమించిన విమానాల్లో కొన్నింటికి కాలం చెల్లడంతో వాటి ఆధునికీకరణ కూడా సాగుతోందని అంటారు. గత నెలలోనే నాలుగు వందల మిలియన్ డాలర్ల వ్యయంతో అది మలిదశ కార్యక్రమానికి నడుంబిగించింది. ఈ ప్రమాదం నేపథ్యంలో ఎయిర్ ఇండియా తన విమానాల సంపూర్ణ ప్రక్షాళనకు సిద్ధపడక తప్పదు. విమానాల ఆధునికీకరణకు సంబంధించి దేశీయ విమానయాన సంస్థలు ఎదుర్కొం టున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకొని వాటి తరఫున విదేశాలతో వ్యవహరించడం అవసరం. సాంకేతిక వైఫల్యాల నుంచి మానవ నిర్లక్ష్యం వరకూ ఈ ప్రమాదానికి దోహదం చేసిన అంశాలన్నింటినీ నిక్కచ్చిగా గుర్తించి, కఠినమైన చర్యలను చేపట్టడంతో పాటు, సరైన పరిష్కారాలను సాధించడం అవసరం. దేశీయంగా విమాన సాంకేతికతను బలోపేతం చేసుకోవాల్సిన అసవరం కూడా ఏర్పడింది. మనదశంలో ఐఐటిలు మొదలు అనేక ఇంజనీరింగ్ కాలజీల్లో చదువుతున్న లక్షల మంది యువ విద్యార్థుల్లో విమానరంగ విద్యపై శిక్షణ ఇవ్వాల్సి ఉంది. అలాంటి కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ రకంగా విద్యకు, ఉపాధికి లంకె వేసి దేశీయంగా విమానయాన రంగాన్ని బలోపేతం చేయాలి. మరిన్ని విమానాశ్రయాలను నిర్మించాలి. ప్రమాదాలపై తక్షణం అధ్యయనం చేయాలి. వాటిని ఆచరించి ముమ్ముందు అలాంటివి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే మనం సమర్థంగా ముందుకు సాగగలం.

# తెలంగాణలో స్థానిక సందడి

- మంత్రుల ప్రకటనలతో నేతల అలర్ట్
- గ్రామాల్లో ఊపందుకోనున్న రాజకీయ వేడి



**హైదరాబాద్, జూన్ 14 :** తెలంగాణలో స్థానిక సంస్థలకు త్వరలోనే ఎన్నికలంటూ మంత్రులు అడపాదడపా ప్రకటనలు చేస్తున్నారు. గెలిచేది తామేనని కూడా ప్రకటిస్తున్నారు. ఈ క్రమంలో జూన్, జూలై మధ్య ఎన్నికలకు అవకాశాలు మెండుగా ఉన్నాయి. సర్పంచ్, ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలను నిర్వహించేలా లోలోపల వేగంగా పావులు కదుపుతున్నాయని అనుకోవచ్చు. ఇటీవల మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, సీతక్క తదితరులు వరుస ప్రకటనలు చేస్తున్నారు. అలాగే రెవెన్యూ సదస్సుల పేరుతో మంత్రులు జిల్లాల పర్యటనలు చేసేస్తున్నారు. ఇదంతా ఓ రకంగా ప్రజల్లో తమ బలాన్ని మరింత పెంచుకునేలాచేసే యత్నమని గుర్తించాలి. ఈ క్రమంలో గ్రామాల్లో రాజకీయ వేడి రాజుకుంటోంది. కొన్ని రోజులుగా రాజకీయ పార్టీల సందడి జోరుగా కనిపిస్తోంది.

## నేతలంతా నిత్యం ప్రజల్లోనే..

ఇప్పటికిప్పుడు ఎన్నికలు లేకున్నా ఖాళీగా కూర్చునే ఆలోచనలో లేరు. పార్టీలన్నీ ఏదో ఓ కార్యక్రమంతో ప్రజల్లోకి వెళుతున్నాయి. నిత్యం ప్రజల్లోనే ఉంటున్నాయి. నేతలంతా ఏదో ఒక కార్యక్రమంలో ముందుకు సాగుతున్నారు. తెలంగాణలో బిజెపి, కాంగ్రెస్, బిఆర్‌ఎస్ కూడా నిత్యం కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళుతోంది. ఇలా జిల్లాలో ప్రధాన రాజకీయ పక్షాలు ప్రజాక్షేత్రంలోకి వెళ్లి బలోపేతం కావడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. ఒక్కో పార్టీ ఒక్కో పేరిట ప్రజల్లోకి వెళ్లి తమ వాణిని వినిపిస్తున్నాయి. బిఆర్‌ఎస్ దీనిని బాగా ఉపయోగించుకుంటోంది. తెలంగాణ మొత్తం అభివృద్ధి చెందిందన్న ప్రచారంతో ప్రజలను బురిడీ కొట్టిస్తోంది. తెలంగాణ సస్యశ్యామలం కావడమే గాకుండా బంగారు తునకగా మారిందన్న ప్రచారంతో నేతలు, అధినేతలు తరిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీలు కూడా పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా నేరుగా ఓటరు వద్దకు వెళ్లు తున్నాయి. ఎమ్మెల్యేలు జనం లో ఉండాలన్న అధికార పక్షం ఆదేశాన్ని తూచా తప్పకుండా పాటిస్తున్నారు. ప్రజల మధ్య ఉంటూ తమ గెలుపునకు వ్యూహ రచన చేస్తున్నారు. ప్రతిపక్ష ఆశావహులు సైతం గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో పల్లెల్లో స్థానిక ఉన్నికల హడావిడి కనిపిస్తోంది. నిత్యం ఏదో ఒక పార్టీ నేత, ఏదో ఒక కార్యక్రమం పేరిట ప్రజల వద్దకు వస్తున్నారు. తమ తమ ప్రభుత్వాల పాలన, పార్టీ కార్యక్రమాలు, లక్ష్యాలు, పనితీరును వివరించడానికి నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు.

## రాజకీయ నాయకుల దూకుడు

స్థానిక ఎన్నికల ఊహాగానాలు వినిపిస్తున్న నేపథ్యంలో రాజకీయ నాయకులు తమ దూకుడును పెంచుతున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో హడావిడి స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వ పథకాలపై బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, పార్టీ ప్రజా ప్రతినిధులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. విమర్శలు చేస్తున్నారు. మంత్రులు రెవెన్యూ సదస్సులు ఇతర కార్యక్రమాల్లో భాగంగా ఊరూవాడ చుట్టేస్తున్నారు. కార్యక్రమాల్లో భాగంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ఇతర ప్రజాప్రతినిధులు ప్రజలతో భాగస్వామ్యమై కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇకపోతే విపక్ష బిఆర్‌ఎస్ గతంలో కెసిఆర్ సర్కార్ చేపట్టిన పథకాలను వివరించడం, లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాధీ ముబారక్, సీఎం సహాయ నిధి వంటి పథకాలు అటకెక్కాయని విమర్శలు చేస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పదకొండేళ్ల పాలనపై బీజేపీ నేతలు ప్రచారం నిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నారు. స్థానిక నేతలు నియోజకవర్గాల పరిధిలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తున్నా రు. రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన అందిస్తోందని విమర్శిస్తూనే కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలు, పథకాలు, అభివృద్ధి పనులను వివరిస్తున్నారు. మొత్తంగా అన్ని పార్టీలు ఇప్పుడు ప్రజల్లో ఉంటున్నాయి. తమ ఘనతను చాటుతున్నాయి. తామే బెటర్ అని చెప్పుకుంటున్నాయి.

# నైరుతి మందగమనంతో వర్షాలు ఆలస్యం

- రైతన్నను కుంగదీస్తున్న వర్షాభావం
- తొలకరి ఆలస్యంతో ఆందోళన



**హైదరాబాద్, జూన్ 14 :** ప్రస్తుత వాతావరణం చూస్తుంటే ఇంకా ఎండాకాలం ఉందా లేక వానాకాలమేనా అన్నట్లుగా ఉంది. రుతుపవనాలు వచ్చి పక్షం రోజులు దాటినా పూర్తిస్థాయిలో వర్షాలు కురియడం లేదు. వర్షాలు ముఖం చాటేయడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. తొలకరి రాక ఆలస్యం కావడంతో ఇప్పటికే దుక్కులు దున్ని విత్తనాలు వేసేందుకు రైతులు సిద్దంగా ఉన్నారు. కొన్నిచోట్ల పత్తి నాటుకున్నారు. దీంతో ఆ రైతుల్లో ఆందోళన తీవ్రం అవుతోంది. గత వారంరోజులుగా వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే మండుటెండలు, వడగాల్పులు చూస్తుంటే మరో వారం దాకా తొలకరి చిలకరించే పరిస్థితి కానరావడం లేదు. ఇప్పటికే నైరుతి తొందరగా వచ్చింది. అయినా సకాలంలో వర్షాలు కరియడం లేదు. దీంతో సాగు భూములకు నీరు లేక నెర్రెలు బారుతున్నాయి. తొలకరి వర్షాలతో విత్తనాలు మొలకెత్తాల్సిన సమయమిది. వర్షాలు లేకపోవడం వల్ల మొలిచిన మొక్కలు ఒక పక్క ఎండుతుండగా, మరో పక్క సాగు భూములు నెర్రులు పడుతున్నాయని రైతులు వాపోతున్నారు. కనీసం ఒక్క చినుకైనా గట్టిగా కురియకపోతే విత్తులు మురిగిపోవడం ఖాయంగా కనినిస్తోంది.మృగశిర కార్తె ప్రారంభంలోనే వర్షాలు కురియడం ఆనవాయితీ. అప్పుడే విత్తనాలు వేస్తారు.

## రైతులు చూపు.. ఆకాశం వైపు

ఓ వైపు వ్యవసాయాధి కారులు హెచ్చరిస్తున్నా వినలేదు. దుక్కులు దున్ని చాలా మంది రైతులు విత్తనాలు నాటుకునేందుకు సమాయత్తం అవుతున్న తరుణంలో వర్షాలు లేకపోవడంతో రైతులు ఆకాశం వైపు ఆందోళనతో చూస్తున్నారు. ఇక మొలచిన మొక్కలను బతికించుకొనేందుకు రైతులు పడుతున్న బాధలు వర్ణణాతీతం. వర్షాధారంపైనే ఆధారపడిన రైతులు అష్టకష్టాలు పడుతన్నారు. ఖరీఫ్ ప్రారంభంలోనే అన్నదాతలకు కష్టాలు వెంటాడుతుండటంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. చాలాచోట్ల ఎక్కువ మంది రైతులు వాణిజ్య పంట అయిన పత్తి పంటనే సాగు చేస్తారు. వర్షాకాలం ప్రారంభంలోనే రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి ఖరీఫ్‌కు సిద్ధమయ్యారు. ఈసారి వర్షాలు ఆలస్యం కావడంతో ఎప్పుడు పడతాయోనని వాపోతున్నారు. నైరుతి రుతు పవనాలు మే నెలాఖరుకే రాష్ట్రాన్ని తాకాయి. రెండు రోజుల్లో తెలంగాణలోని మరికొన్ని జిల్లాలకు, ఆ తర్వాతి రెండు రోజుల్లో రాష్ట్రమంతా విస్తరిస్తాయని వెల్లడించింది. వాతావరణంలో వచ్చిన మార్పుల నేపథ్యంలో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు కాస్త తగ్గాయి. రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాల రాకతో పలు జిల్లాల్లో వానలు పడ్డాయి. ఉరుములు, మెరుపుతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. భారీ వర్షాలు కురిసే చాన్స్ ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.



# దేశానికి ఆదర్శం కాళేశ్వరం

- దానిని ఉపయోగించే పని చేయండి
- మాజీ మంత్రి వేముల సూచన

**నిజామాబాద్, జూన్ 14 :** తెలంగాణలో గత సిఎం కెసిఆర్ అనుసరించిన రైతు విధానాలను కాంగరెస్ పాటించివుంటే రైతులకు ఇన్ని కష్టాలు వచ్చివుండేవి కావని మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కాళేశ్వరంను ఎలా ఉపయోగించుకోవాలో కూడా వీరికి తెలియడం లేదన్నారు. రైతులకు సాగునీరు, పెట్టుబడి పథకం,బీమా పథకం అమలు చేయడం, పండిన ధాన్యం కొనుగోలు చేయడం వంటి పథకాలు పక్కాగా అమలయితే దేశంలో కరువు కాటకాలు ఉండవన్నారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడరని అన్నారు. ఇప్పటికే తెలంగాణ వ్యవసాయ రంగంలో ఓ రోల్ మాడల్‌గా నిలిచిందని అన్నారు. రైతుబీమా పథకం దేశానికే మార్గదర్శకంగా మారనుందని అన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేయాలని తపించిన కెసిఆర్ రైతును రాజు చేయడమే లక్ష్యంగా అనేకానేక చర్యలు తీసుకుని ముందుకు నడిపించారని అన్నారు. అయితే కాంగ్రెస్ ఇవన్నీ పక్కన పెట్టి కాళేశ్వరంపై బురదజల్లే చర్యలకు ఉపక్రమించిందని అన్నారు. తెలంగాణ రైతులకు అండగా ఉంటూ వ్యవసాయరంగంలో నంబర్‌వన్ రాష్ట్రంగా నిలిపిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతు బీమా అమలు చేసిన ఏకైక రాష్ట్రం మనదేనని అన్నారు. ఏ కారణం చేతనైనా రైతు మరణిస్తే నామినీకి పది రోజుల్లో రూ.5 లక్షల ఇన్సూరెన్స్ అందించామని చెప్పారు. అందుకే ఈ పథకాలను తెలుసుకున్న దేశంలోని అన్ని రాజకీయపార్టీలు కేసీఆర్‌ను కొనియాడాయన్నారు. రైతుల కష్టాలు తెలిసిన కేసీఆర్ రైతుబీమా పథకాన్ని అమలులోకి తీసుకువచ్చారని అన్నారు. కాళేశ్వరంలో నీళ్లు ఎలా లిఫ్ట చేయాలో తెలియక పొలాలు ఎండబెట్టారని, ప్రాజెక్టుల్లో నీరు చేరకుండా చేశారని అన్నారు. కాళేశ్వరం సహా చేపట్టిన అన్ని ప్రాజెక్టులు పూర్తయితే ఇక సాగునీటికి ఢోకా ఉండదన్నారు. ఇప్పటికే చెరువుల పునరుద్దరణ కారణంగా జలకళను సంతరించుకున్నాయని అన్నారు. దీంతో సేద్యం అన్నది రైతుకు భారం కాబోదన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో రైతు సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించుకుని, అమలు చేసుకున్నామని పేర్కొన్నారు. ఎన్నో ఇబ్బందులను అధిగమించి ముందుకు సాగుతుంటే కాంగ్రెస్ వాళ్లు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని మండిపడ్డారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా విత్తనాలు, ఎరువులు ముందుగానే స్టాక్ పెట్టాలని పేర్కొన్నారు. పండిన పంటకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. తెలంగాణలో 24గంటల కరెంట్, నీళ్లు, పెట్టుబడి, ఎరువులు, విత్తనాలు ఇవ్వాలని అన్నారు.



# వైభవంగా ప్రసన్న వేంకటేశ్వరుడి రథోత్సవం

**తిరుపతి, జూన్ 14 :** తిరుపతి అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 9.00 గంటలకు శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా సాగింది. రథోత్సవంపై శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి విహరించి భక్తులను అనుగ్రహించారు. ఉదయం 7 – 8.30 గం.ల మధ్య పుణ్యాహవచనం, నవగ్రహపూజ చేపట్టారు. తదుపరి రథారోహణం, నిర్వహించారు. 09.00 – 10.30 గం.లకు భక్తజనసమోహం మధ్య రథోత్సవం చేపట్టారు. సాయంత్రం ఊంజల్ సేవ, అశ్వవాహనంపై స్వామి వారు భక్తులను ఆశీర్వదించనున్నారు.ఆదివారం ఉదయం పల్లకీ ఉత్సవం జరుగనుంది. తదుపరి స్నపన తిరుమంజనం చేపడుతారు. అనంతరం ఉదయం 10.30 – 10.45 గం.ల వరకు తీర్థవారి చక్రస్నానం నిర్వహిస్తారు. సాయంత్రం శ్రీవారి మాడవీధి ఉత్సవం జరుగుతుంది. రాత్రి ఏడుగంటలకు ధ్వజావరోహణతో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగియ నున్నాయి. వాహన సేవలో టిటిడి డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరా జులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, అర్చకులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

# నాలాల్లో పేరుకుపోయిన చెత్త తొలగింపు

## వేగంగా పనులు పూర్తి చేయాలన్న హైడ్రా కమిషనర్

**హైదరాబాద్, జూన్ 14 :** నగరంలోని నాలాల్లో పేరుకుపోయిన చెత్త తొలగింపు పనులు వేగవంతం చేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. నాలాల్లో ఎక్కడా ఆటంకాలు లేకుండా చూడాలని, నాలా ఆక్రమణలుంటే తొలగించాలన్నారు. శుక్రవారం చింతల్‌బస్తీ మీదుగా సాగే బుల్కాపూర్ నాలా విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. చింతలబస్తీలో మూడ్రోజుల క్రితం తొలగించిన నాలా ఆక్రమణల కింద భారీగా పేరుకుపోయిన పూడికను తొలగించాలన్నారు. శంకర్ పల్లిలోని బుల్కాపూర్ చెరువు నుంచి వచ్చే నాలా మియాఖాన్ గడ్డ, జన్వాడ, ఖానాపూర్, కోకాపేట, నార్సింగి, పుప్పాలగూడ, మణికొండ, రాయదుర్గం, ఓయూకాలనీ, షేక్ పేట, బీజేఆర్ నగర్, మహాత్మాగాంధీ నగర్, హాఖీమ్సా విరాట్‌నగర్, బృందావన్ కాలనీ, టోలిచౌకి, మెహిదీపట్నం మిలటరీ ఏరియా, బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12, చింతలబస్తీ, తుమ్మలబస్తీ, ఖైరతాబాద్ మీదుగా హుస్సేన్ సాగర్‌కు వరదనీరును తీసుకువస్తుంది. చింతల్ బస్తీలో ఇటీవల హైడ్రా అధికారులు నాలాల కబ్జాలను తొలగించే సమయంలో ధ్వంసమైన వాటర్ బోర్డు మెయిన్ పైప్ లైన్ ను అధికారులు రిపేర్లు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈ పనులను ఎండీ అశోక్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హైడ్రా నాలా ఆక్రమణ తొలగింపు సందర్భంగా బంజారాహిల్స్ సంప్ ఔట్ లెట్ నుంచి మసాబ్ ట్యాంక్, ఏసీ గార్డ్స్ కు మంచినీటిని సరాఫరా చేసే 300 ఎంఎం డయా పైప్‌లైన్ దెబ్బతిన్నది. స్పందించిన అధికారులు రిపేర్లు పూర్తి చేసి సరఫరా పునరుద్ధరించారు. అంతకు ముందు ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉచిత ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేశారు.



## తాగునీటి కోసం ఖాళీ బిందెలతో రహదారిపై నిరసన

**కామారెడ్డి జిల్లా మహమ్మద్ నగర్ :** మండలం తెలుగు జనశక్తి జూన్ 14 : కామారెడ్డి జిల్లా మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో బుడగ జంగం కాలనీవాసులు గత వారం రోజుల నుండి తాగునీరు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు, వారి సమస్యలను పంచాయతీ యాజమాన్యం పరిష్కరించాలని రోడ్డుపై ఖాళీ బిందెలతో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజులుగా తాగునీరు దొరకక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అందుకే రోడ్డు ఎక్కామని అన్నారు. విషయం తెలుసుకున్న నిజాంసాగర్ ఎస్సై అక్కడకు చేరుకొని వారికి పంచాయతీ సిబ్బందితో మాట్లాడి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



## మాచాపూర్‌లో నూతన కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం ఎన్నిక

**కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి (తెలుగు జనశక్తి) జూన్ 14 :** ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆదేశాల మేరకు, ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కురుమ సాయిబాబా ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి మండలంలోని మాచాపూర్ గ్రామలో, కాంగ్రెస్ పార్టీ తరపున గ్రామ అధ్యక్షులను ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా నోముల ప్రవీణ్ ను అందరూ ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ నాయకులు పాల్గొనడం జరిగింది.



## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి (తెలుగు జనశక్తి) జూన్ 14 :** ఎల్లారెడ్డి మండలంలోని కళ్యాణి గ్రామానికి చెందిన గుజ్జరి జగదీష్ గత ఏడాది ప్రమాదంలో మ-రణించినారు. ఈ విషయం పై స్పందించిన ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ మోహన్ బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కు ద్వారా రూ : 60000/- లను శాంక్షన్ చేయడం జరిగింది. ఈ చెక్కును కళ్యాణి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంజీవులు, పార్టీ నాయకులు కలిసి బాధితుడి భార్య సునీతకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సునీత ఎమ్మెల్యే మదన్ మోహన్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపినారు.



## టోల్గేట్ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరికి నిరసనగా రాస్తారోకోను జయప్రదం చేయండి

**సూర్యాపేట జిల్లా, హుజూర్నగర్, తెలుగు జనశక్తి ప్రతినిధి :** స్థానిక వాహనదారులకు ఉచిత ప్రయాణం కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న టోల్గేట్ యాజమాన్య వైఖరికి నిరసనగా ఈనెల 16వ తేదీన చిల్లేపల్లి టోల్గేట్ వద్ద జరగనున్న నిరవధిక రాస్తారోకోను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాల ధనంజయ నాయుడు ,సిపిఎం పట్టణ కార్యదర్శి గుండ్ల నగేష్ ,టిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు నవీన్ కుమార్ రాపోల్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఇంజమూరి వెంకటయ్య, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సరికొప్పుల నాగేశ్వరరావు తెలియజేశారు. శనివారం నేరేడుచర్ల మండల కేంద్రంలో జరిగిన వివిధ రాజకీయ పక్షాల మరియు ప్రజాసంఘాల సమావేశంలో పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక చోట్ల టోల్గేట్ పరిధిలోని 20 కిలోమీటర్ల వరకు వాహనదారులకు ఉచిత ప్రయాణం కల్పించాల్సి ఉండగా నేటి యాజమాన్యం అందుకు విరుద్ధంగా ప్రవర్తించడాన్ని వారు తప్పు పట్టారు. టోల్గేట్ చుట్టూ 20 కిలోమీటర్ల పరిధిలోకి వాహనదారులందరూ సోమవారం ఉదయం 10 గంటలకు టోల్గేట్ వద్దకు చేరుకోవాలని యాజమాన్యం వాహనదారుల డిమాండ్స్ అంగీకరించేంత వరకు నిరవధిక రాస్తారోకో చేసేందుకు సిద్ధంగా ఉండాలని అందుకు పోలీసు వారు ,సంబంధిత అధికారులు సహకరించాలని ప్రజలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్న టోల్గేట్ యాజమాన్యం పట్ల పోలీసులు ఉదాసీన వైఖరి అవలంబించవద్దని ఆయన కోరారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలక రాజు శ్రీను ,ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షుడు ఎడవల్లి అరుణ్ ,ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు ఊదర వెంకన్న ,ఎడవల్లి వెంకట కృష్ణ ,బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్మరాజు వెంకట్ ,ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు పరిక భరత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంకెన్నాళ్లు మాయమాటలతో ప్రజలను మోసం..?

- ఎన్నికల ఎత్తుగడలో భాగంగానే ఇందిరమ్మ ఇళ్ల పంపకాలు
- బీఎస్‌పీకి ప్రజలు అధికారం ఇవ్వడం ద్వారానే చర్ల మండల ప్రాంతం అభివృద్ధి చెందుతుంది
- బీఎస్‌పీ మండల అధ్యక్షులు కొండా చరణ్



**చర్ల, జూన్ 14, తెలుగు జనశక్తి :** చర్ల మండల కేంద్రంలో ఉన్న బహుజన సమాజ్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల ముఖ్య నాయకుల సమావేశం పార్టీ సీనియర్ నాయకులు సామల ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల ఈసీ మెంబర్ గుర్రాల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో చర్ల గ్రామస్తులైన చీపురు మణికంఠ, అంకాల లక్ష్మణరావులను పార్టీ మండల అధ్యక్షులు కొండా చరణ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు చరణ్ మాట్లాడుతూ బహుజన సమాజ్ పార్టీ (బీ ఎస్ పీ)లోకి వీరు రావడం సంతోష్ కరమైన విషయమని, కచ్చితంగా పార్టీ ఈ కుటుంబాలకు అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ చర్ల మండలాన్ని చర్ల మండల ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందని, ఎన్నికల్లో ప్రజలను మాయ మాటలతో మభ్య పెట్టారని అన్నారు. కోరెగడ్డ నిర్వాసితులకు నష్టపరిహారం, వరద బాధితులకు 5 సెంట్ల ఇళ్ల స్థలాలు, చర్లలో డిగ్రీ కాలేజీ ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదని, మెడికల్ కాలేజీ ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదని, వద్దిపేట లిఫ్ట్ ఇరిగేషన్, చర్ల మండల కేంద్రంలో అదనపు ట్యాంకు నిర్మాణం పూర్తి కాలేదని పూర్తిస్థాయిలో పోడు భూములకు పట్టాలు ఇవ్వలేదని వలస ఆదివాసులకు ఎస్సీ క్యాస్ట్ సర్టిఫికెట్లు ఇవ్వలేదని, ఈత వాగు హై లెవెల్ బ్రిడ్జి నిర్మించలేదని ఫైర్ స్టేషన్ నిర్మిచలేదని వరదల విపత్తు రక్షణ కొరకు ప్రభుత్వమే లాంచీలను కొని ఏర్పాటు చేస్తామని ఇప్పటి వరకు చేయలేదని అన్నారు. యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వలేదని రూ.4 వేలు పింఛన్లు ఇవ్వలేదన్నారు. చర్ల మండల ప్రాంతానికి ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీని కాంగ్రెస్ నెరవేర్చలేదని అన్నారు. ఇంకెన్నాళ్లు ప్రజల్ని మాయమాటలతో మభ్యపెడతారని ప్రశ్నించారు. ఎన్నికల ఎత్తుగడలో భాగంగానే ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ మొదలు పెట్టారని, ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక లిస్టు పారదర్శకంగా లేదని నిజమైన అర్హులకు మొదటి దఫా లిస్టులో పేర్లు రాలేదని తెలిపారు. అధికార పార్టీ అండదండలతో అర్హత లేని వాళ్ళు ఇంద్రమ్మ ఇల్లు పొందుతున్నారని ఆరోపించారు. రానున్న సంస్థ గత ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ ఇదే రకంగా వ్యవహరిస్తారని ప్రజలు ఈ విషయాన్ని గుర్తించాలని తెలిపారు. ఈ సందర్భంగా చర్ల మండలం ప్రాంతం అభివృద్ధి జరగాలంటే బీ ఎస్ పీ కి ప్రజలు అధికారం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ కార్యదర్శి కొండా కౌశిక్, పార్టీ నాయకులు గోగికార్ రామ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు





**కామారెడ్డి జిల్లా గాంధారి తెలుగు జనశక్తి జూన్ 14 :** గాంధారి మండలం గుడిమెట్ శివారులో గల రైస్ మిల్ వద్ద శనివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో లింగంపల్లి గ్రామానికి చెందిన కమిల్ల చిన్న సాయిలు అనే వ్యక్తి బైక్ పైన లింగంపల్లి నుండి గాంధారికి వస్తుండగా వెనకాల నుంచి వస్తున్న పద్మాజివాడి గ్రామానికి చెందిన దత్తారెడ్డి అనే వ్యక్తి షిఫ్ట్ డిజైర్ కారు నడుపుతూ వెనకనుంచి ఢీకొట్టడం వల్ల బైకు నడుపుతున్న కామిల చిన్న సాయిలు కు తలకు చేతులకు తీవ్ర రక్త గాయాలైనాయి. వెంటనే 108 అంబులెన్స్ లో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి పంపనైనది. గాయస్తుని అన్న అయిన కమిల్ల పెద్ద సాయిలు ఫిర్యాదు మేరకు ఎస్సై ఆంజనేయులు కేసు నమోదు చేశారు.

## రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరడమే లక్ష్యంగా పనిచేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ నాయకులు



**రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ప్రతినిధి ( తెలుగు జనశక్తి) జూన్ 14 :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పనిచేయాలి. వేములవాడ మున్సిపల్ మాజీ కో ఆప్షన్ సభ్యులు కట్కూరి శ్రీనివాస్ 200 మందితో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పేద ప్రజలకు అనేక పథకాలను రూపకల్పన చేసింది. కొత్త పాత అనే తేడా లేకుండా కలసిగట్టుగా పని చేస్తు ముందుకు పోవాలీ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతీ ఒక్కరికీ అందేలా చూడాలి.. పార్టీలోకి ఎవరు వచ్చినా ఆహ్వానిస్తామనీ, అందరం కలిసి వేములవాడను అభివృద్ధి చేసుకుందాం



## గ్రామంలో నీటి కొరత..

### అధికారులు స్పందించాలని గ్రామస్తులు డిమాండ్

**కామారెడ్డి జిల్లా గాంధారి తెలుగు జనశక్తి జూన్ 14 :** కామారెడ్డి జిల్లా గాంధారి మండలం బ్రాహ్మణపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో మిషన్ భగీరథ నీళ్లు లేక ఇబ్బంది పడుతున్నాడంతో గ్రామంలో ఉన్న గ్రామ పంచాయతీ బోర్లు రెండున్నప్పడికి అందులో ఒకటి చెడిపోవడంతో అసలు గ్రామంలో నీళ్లు లేని పరిస్థితి నెలకొంది. దీంతో ఉన్నటువంటి కురుస్తున్న వర్షం నీటిని అన్నిటికీ ఉపయోగిస్తున్నామని గ్రామస్తులు శనివారం గ్రామపంచాయతీ ముందు ఆందోళనకు దిగారు. అంతేకాకుండా తాగడానికి నీళ్లు మోటార్ నుండి రాకపోవడంతో తాగడానికి నీళ్లు లేక చాలా ఇబ్బంది పడి చివరికి వర్షం నీరు మమ్మల్ని ఆదుకుందని గ్రామస్తులు తమ గోడును వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు కనీస తాగునీరు ని అందించాలని గ్రామస్తులు వేరే అవసరాలకు వర్షపు నీరుని ఉపయోగించుకున్న కనీసం తాగేందుకు మంచినీటి అందించలేరా అని గ్రామస్తులు వేడుకుంటున్నారు. ఈదురుగాళ్లకు కరెంటు కూడా రెండు రోజులుగా టైం కు లేకపోవడంతో అందులో కూడా ఒక మోటారు రిపేర్ లో ఉండడంతో నీటి సమస్య వచ్చిందని త్వరలోనే పరిష్కారం దిశగ మార్గం చూస్తున్నామని త్వరలోనే బోరు బాగు చేస్తామని తెలిపారు.



## బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేత

**మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం జూన్ 14 తెలుగు జనశక్తి :** మండలంలోని వెలికట్ట గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన బందు (గుండాల) లచ్చమ్మ మృతి చెందడంతో వెలికట్ట గ్రామానికి చెందిన యాదవ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు బత్తుల యాకయ్య శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి 50 కేజీల సన్న బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యాకయ్య మాట్లాడుతూ పేద కుటుంబాలకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు బందు ఎల్లయ్య,బందు యాకయ్య, వెంకటేష్,పూలమ్మ,రాజేశ్వరి, స్థానికులు బందు బాబు, సోమయ్య,యాకయ్య, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.




## తుంపల్లిలో హెల్పింగ్ హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

### హెల్పింగ్ హార్ట్ ఫౌండేషన్ చైర్మన్ అయినాల శ్రీకాంత్

**నిజామాబాద్ జిల్లా సిరికొండ (తెలుగు జనశక్తి) జూన్ 14 :** సిరికొండ మండలం తుంపల్లిలో జూన్ 14వ ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పునరించుకొని హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాల్లో రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలుస్తున్న హరీష్ గౌడ్, బాలరాజ్, రాజు, కిషన్, రవి, మహేష్, శేఖర్, రాజేశ్వర్, గోపాల్ తూంపల్లి యువకులను అభినందిస్తూ ప్రశంస పత్రాలు ఫౌండేషన్ వారు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ అయినాల శ్రీకాంత్ మాట్లాడుతూ అన్ని దానాల్లో కల్లా రక్తదానాన్ని గొప్ప దానంగా భావిస్తారు ఎందుకంటే ఒకరు ఇచ్చిన రక్తం ద్వారా ముగ్గురు జీవితాలను కాపాడుతుంది. ఇలా రక్తం దానం చేయడం వలన ప్రాణం కాపాడడమే కాదు మన ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు. అత్యవసర పరిస్థితుల్లో సరైన సమయంలో రక్తం అందుబాటులో లేకపోతే అది రోగి జీవితానికి ప్రాణాంతకం కావచ్చు కాబట్టి ప్రతి రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వి డి సి చైర్మన్ లక్ష్మణ్ గౌడ్ ఫౌండేషన్ వైస్ చైర్మన్ రాజేందర్,రవి,ప్రశాంత్,యశ్వంత్, బాలరాజ్,అనిల్ పాల్గొన్నారు.



## తొర్రురులో తొలిప్రేమ సినిమా గ్రాండ్‌గా రీరిలీజ్

**మహబూబాబాద్ జిల్లా తోర్రుర్ మండలం జూన్ 14 తెలుగు జనశక్తి :** తొర్రురులో డివిజన్ కేంద్రంలోని స్థానిక ఏషియన్ రామకృష్ణ థియేటర్ లో పవన్ కళ్యాణ్ నటించిన తొలిప్రేమ చిత్రాన్ని ఫ్యాన్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు సయ్యద్ చాంద్ పాషా ఆధ్వర్యంలో శనివారం గ్రాండ్ గా రీరిలీజ్ చేశారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ 1998 లో ఇండస్ట్రీ రికార్డులను బద్దులుకొట్టి పవన్ కళ్యాణ్ ని పవర్ స్టార్ ని చేసిందని,అలాగే ఇండస్ట్రీ హిట్ గా నిలిచిందన్నారు. అప్పట్లో 275 రోజులు ఆడిందని అన్నారు.ఈ చిత్రానికి తొర్రురు మండల ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు మహ్మద్ మాలిక్, ఉపాధ్యక్షులు చింతల మధు,సతీష్,అంజయ్య,సంధ్య, అభిమానులు పాల్గొన్నారు.



## కళ్యాణలక్ష్మి చెక్కుల అందజేత

**కామారెడ్డి జిల్లా లింగంపేట్ తెలుగు జనశక్తి జూన్ 14 :** లింగంపేట్ మండలంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ ఆదేశాల మేరకు భవానిపేట్, జల్దిపల్లీ , కొండాపూర్, బానాపూర్, గ్రామాలలో 23 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేసినట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర నారా గౌడ్, తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు, ఎల్లప్పుడూ అండగా ఉంటుందని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు, ఈ కార్యక్రమంలో, టిపిసిసి మైనార్టీ సెల్ జనరల్ సెక్రెటరీ రఫియొద్దిన్, పార్టీ సీనియర్ నాయకులు, వంజరి ఎల్లమయ్య, నాగులూరి సాయిలు, ఆయా గ్రామాల, పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## విద్యార్థులకు ఉచిత బస్ పాసులు ఇవ్వాలి

**మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం జూన్ 14 తెలుగు జనశక్తి :** పట్టణ కేంద్రంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వద్ద ఎస్ఎఫ్ఐ తొర్రూరు మండల కమిటీ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం మరియు ఆర్టీసీ సంస్థ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా నాయకులు ఎం.డి అమీర్ , తొర్రూర్ మండల అధ్యక్షుడు ఆకాశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బస్ పాస్ ఛార్జీలు పెంచడం సరికాదన్నారు. గత ప్రభుత్వ హయాంలో 1150 రూపాయలు. ఉంటే ఇప్పుడు 1400 వందలకు పెంచి రాష్ట్ర ప్రభుత్వం. జిల్లాలో మారుమూల ప్రాంతాలనుండి చదువుకోడానికి విద్యార్థులు మండలాలకు అలాగే జిల్లా కేంద్రానికి విద్యార్థులపై భారం మోపడం సరికాదన్నారు. ఇప్పటికే విద్యార్థులు బస్ పాస్ ఛార్జీలు కట్టలేక తల్లితండ్రుల పై ఒత్తిడి చూస్తున్నారన్నారు. విద్యార్థులను చదువుల కోసం మండలాలకి జిల్లా కేంద్రంలోకి పంపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ మండల అధ్యక్షుడు ఆకాష్,ఉపాధ్యక్షులు మహేష్ ,మండల నాయకులు శివ,సందీప్, నవీన్ తదితరులు పాల్గొన్నారు




## డ్రీమ్‌లైనర్ విమానాల్లో తనిఖీలు మొదలుపెట్టాం : ఎయిరిండియా

**న్యూఢిల్లీ :** ఎయిరిండియా వద్దనున్న బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాల్లో విస్తృత తనిఖీలు చేపట్టాలని పౌర విమానయాన శాఖ డైరెక్టరేట్ జనరల్ ఆదేశించిన విషయం తెలిసిందే. ఇందుకు అనుగుణంగా సంస్థకు చెందిన 'బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్' విమానాల్లో తొమ్మిదింటిలో భద్రతా తనిఖీలు పూర్తి చేసినట్లు ఎయిరిండియా వెల్లడించింది. మిగిలిన 24 డ్రీమ్‌లైనర్‌ల తనిఖీలు త్వరలోనే పూర్తిచేయనున్నట్లు తెలిపింది. "డీజీసీఏ ఆదేశాల ప్రకారం వన్-టైమ్ భద్రతా తనిఖీలు పూర్తి చేసే ప్రక్రియను ఎయిరిండియా కొనసాగిస్తోంది. బోయింగ్ 787 విమానాలు భారత్‌కు తిరిగి రాగానే తనిఖీలు చేస్తున్నాం. ఇప్పటికే తొమ్మిది విమానాలకు పూర్తిచేయగా.. మరో 24 విమానాలకు గడువులోగా పూర్తిచేస్తాం. ఈ తనిఖీల్లో కొన్నింటికి అధిక సమయం పట్టే అవకాశం ఉంది. దాంతో సుదీర్ఘ ప్రయాణ మార్గాల్లో నడిచే విమానాలకు ఆలస్యం కావచ్చు. వీటికి సంబంధించిన సమాచారాన్ని ప్రయాణికులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తాం. ఎయిర్‌పోర్టుకు వెళ్లేముందు విమానాల స్టేటస్‌ను ముందుగానే చెక్ చేసుకోవాలని ప్రయాణికులకు సూచిస్తున్నాం" అని తాజా ప్రకటనలో ఎయిరిండియా పేర్కొంది. టాటా గ్రూప్‌నకు చెందిన ఎయిరిండియా దగ్గరున్న బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాలకు సంబంధించి వివిధ వ్యవస్థల పనితీరును తనిఖీ చేయడంతోపాటు, గాల్లోకి ఎగిరే అంశానికి (టేకాఫ్) సంబంధించిన పరామితులను పరిశీలించాలని డీజీసీఏ తాజా ఆదేశాల్లో స్పష్టం చేసింది. ప్రస్తుతం ఎయిరిండియా దగ్గర బోయింగ్ 787-8 విమానాలు 26, బోయింగ్ 787-9 విమానాలు ఏడు ఉన్నాయి.



## రెండుసార్లు టికెట్ క్యాన్సిల్..

### మూడోసారి విధి వక్రీకరించి

**అహ్మదాబాద్ :** అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదంలో మరణించిన గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపాణీ ప్రయాణానికి సంబంధించి మరో విషయం వెలుగులోకి వచ్చింది. లండన్‌లో ఉన్న తన భార్య, కుమార్తెను కలిసేందుకు వెళ్తున్న రూపాణీ.. అంతకుముందు రెండుసార్లు వెళ్లేందుకు సిద్ధమై టికెట్ రద్దు చేసుకున్నట్లు తెలిసింది. చివరకు మూడోసారి బయలుదేరినప్పటికీ గమ్యాన్ని చేరకముందే విమాన ప్రమాదంలో ఆయన ప్రాణాలు కోల్పోయారు. అంతేకాదు ఆయన లక్కీ నంబర్‌గా భావించే '1206' సంఖ్య కలిగిన తేదీనే ఆయనకు చివరి రోజయ్యింది. రూపాణీ వ్యక్తిగత వాహనాలన్నీ అదే నంబరుతో ఉన్నట్లు సమాచారం. విజయ్ రూపాణీ ఆయన భార్యతో కలిసి మే నెలలోనే లండన్ వెళ్లేందుకు ఎయిరిండియా 171 విమానంలో టికెట్ బుక్ చేసుకున్నారు. కొన్ని కారణాల వల్ల తన పర్యటనను రద్దు చేసుకున్న ఆయన.. తన భార్యను అక్కడికి పంపించారు. జూన్ 5న వెళ్లేందుకు మళ్లీ బుక్ చేసుకున్నప్పటికీ.. అనివార్య కారణాల వల్ల ఆ టికెట్‌ను కూడా క్యాన్సిల్ చేసుకున్నారు. భాజపా పంజాబ్ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న రూపాణీ.. లుధియానా ఉపఎన్నిక నేపథ్యంలోనే తన ప్రయాణాన్ని రెండుసార్లు విరమించుకున్నట్లు తెలుస్తోంది. చివరకు జూన్ 12 లండన్‌కు ప్రయాణమైన రూపాణీ.. విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు.

**మరో జంట కూడా..** అహ్మదాబాద్‌కు సమీపంలోని ఆనంద్ ప్రాంతానికి చెందిన మోనాలి, సన్నీ దంపతులు కూడా విమాన ప్రమాదంలో మృతిచెందారు. లండన్‌కు వెళ్లేందుకు వీరు జూన్ 6నే టికెట్ బుక్ చేసుకున్నప్పటికీ వ్యక్తిగత కారణాల వల్ల దాన్ని ర ద్దు చేసుకున్నారు. చివరకు 12వ తేదీన ఎయిరిండియా విమానంలో బయలు దేరిన వారిద్దరు కానరాని లోకాలకు వెళ్లడాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని వారి బంధువులు వాపోయారు.

## ఎయిరిండియా విమాన ప్రమాదం..

### తోక భాగంలో మృతదేహం..



**అహ్మదాబాద్:** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లోని ఎయిరిండియా విమానం కుప్పకూలిన ప్రాంతంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అటు ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు దర్యాప్తు అధికారులు కూడా ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్నారు. ఈక్రమంలోనే శనివారం ఉదయం శిథిలాలను తొలగిస్తుండగా విమానం తోక భాగంలో మృతదేహాన్ని గుర్తించారు. గురువారం మధ్యాహ్నం అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఈ విమానం టేకాఫ్ అయిన కాసేపటికే విమానాశ్రయం సమీపంలోని వైద్యులు, నర్సింగ్ సిబ్బంది నివాస ప్రాంతం వద్ద కుప్పకూలిన సంగతి తెలిసిందే. దీంతో దాదాపుగా విమా నం మంటల్లో కాలిపోగా.. తోకభాగం మాత్రం భవనంపై చిక్కుకుపోయింది. శనివారం ఉదయం వాటిని తొలగిస్తుండగా.. ఓ మృతదేహాన్ని రెస్క్యూ సిబ్బంది గుర్తించారు. అది విమానంలో విధులు నిర్వర్తించిన ఎయిర్‌హోస్టెస్‌లో ఒకరి మృతదేహం అని అధికారులు వెల్లడించారు.

### మే డే.. నో పవర్: పైలట్ చివరి మాటలు

మరోవైపు ప్రమాదానికి ముందు పైలట్ చివరి మాటలకు సంబంధించిన ఓ ఆడియో సందేశం బయటికొచ్చింది. కేవలం ఐదు సెకన్ల మెసేజ్ అది. అందులో ఎయిరిండియా సీనియర్ పైలట్ కెప్టెన్ సుమిత్ సభ్రావల్.. 'మేడే.. మేడే.. మేడే.. నో పవర్.. నో థ్రస్ట్.. గోయింగ్ డౌన్' అని మెసేజ్ ఇచ్చారు. ఆ వెంటనే విమానం కూలిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంపై కేంద్ర పౌరవిమానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు శనివారం దిల్లీలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ ఘటనపై దర్యాప్తునకు అత్యున్నత కమిటీని ఏర్పాటుచేసేందుకు కేంద్రం సిద్ధమైంది. దుర్ఘటనలో మృతుల సంఖ్య 274కు చేరిన సంగతి తెలిసిందే.


# కశ్మీర్ విషయంలో పొరపాటు..

### భారతీయులకు ఇజ్రాయెల్ క్షమాపణలు



**ఇజ్రాయెల్ :** ఇజ్రాయెల్-ఇరాన్‌ల మధ్య యుద్ధంతో పశ్చిమాసియా మళ్లీ భగ్గుమంది. టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ శుక్రవారం భీకరస్థాయిలో విరుచుకుపడగా.. ఇరాన్ సైతం అంతేస్థాయిలో ప్రతిదాడులు చేసింది. ఈ ఉద్రిక్తతల వేళ ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) చేసిన ఓ పోస్ట్ భారతీయులను ఆగ్రహానికి గురిచేసింది. దీంతో ఐడీఎఫ్ క్షమాపణలు చెప్పింది. టెహ్రాన్‌పై వైమానిక దాడులకు దిగిన ఐడీఎఫ్.. శుక్రవారం రాత్రి తమ 'ఎక్స్' ఖాతాలో ఓ పోస్ట్ చేసింది. "ఇరాన్‌కు ఇజ్రాయెల్ అంతిమ లక్ష్యం కాదు. ఇది ప్రారంభం మాత్రమే. ఆ దేశం ప్రపంచం మొత్తానికి పెనుముప్పే. ఇప్పుడు మాకు మరో అవకాశం లేదు" అని ఐడీఎఫ్ అందులో రాసుకొచ్చింది. దీన్ని ప్రతిబింబించేలా ప్రపంచ పటానికి సంబంధించిన ఓ ఫొటోను కూడా జత చేసింది. అయితే, అందులో భారత మ్యాప్‌ను తప్పుగా చూపించడం వివాదాస్ప దమైంది. ఆ ఫొటోలో జమ్మూకశ్మీర్‌ను పాకిస్థాన్‌లోని భూ భాగంగా చూపిస్తున్నట్లు ఉండటంతో భారత నెటిజన్లు తీవ్రం గా మండిపడ్డారు. దాన్ని వెంటనే డిలీట్ చేయాలని డిమాండ్ చేశారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ట్యాగ్ చేస్తూ పోస్టులు పెట్టారు. దీంతో ఐడీఎఫ్ స్పందించింది. "అది కేవలం ఇరాన్ ముప్పు పొంచి ఉన్న ప్రాంతాలను ఉదహరించడం కోసం చేసిన పోస్ట్ మాత్రమే. అందులో ఉపయోగించిన మ్యాప్ ఫొటో.. దేశాల సరిహద్దులను కచ్చితంగా చూపించ డంలో విఫలమైంది. ఈ తప్పిదానికి మేం క్షమాపణలు తెలియజేస్తున్నాం" అని మరో పోస్ట్ చేసింది. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు మళ్లీ తీవ్రస్థాయికి చేరిన సంగతి తెలిసిందే. తొలుత ఇరాన్ అణు, సైనిక స్థావరాలు, సైనిక ఉన్నతాధికారులు లక్ష్యంగా వందల క్షిపణులు, డ్రోన్లతో ఇజ్రాయె ల్ దాడి చేసింది. ఈ భీకర పోరులో కీలకమైన మిలిటరీ నాయకత్వాన్ని, అణుశాస్త్రవేత్తలను టెహ్రాన్ కోల్పోయింది. ఆ దేశ అణు కేంద్రాల్లోని మౌలిక వసతులు తీవ్రంగా దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రతీకార దాడులకు దిగిన ఇరాన్ తొలుత భారీ సంఖ్యలో డ్రోన్లను ఇజ్రాయెల్ పైకి పంపింది. ఆ తర్వాత శుక్రవారం రాత్రి వందల సంఖ్యలో క్షిపణులను ప్రయోగించింది. దీంతో టెలి అవీవ్, జెరూసలేం లలో పలుచోట్ల పేలుళ్లు జరిగాయి. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య దాడులు కొనసాగుతున్నాయి.

## అక్రమ వలసదారుల అరెస్టుపై వెనక్కి తగ్గిన ట్రంప్



**న్యూయార్క్ :** అక్రమ వలసదారులను వలస సేవలు, సుంకాల విభాగం (ఐస్) అధికారులు అరెస్టు చేయడానికి వ్యతిరేకంగా అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో పెద్దఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఈ అరెస్టుల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాస్త వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. వలసదారులు ఎక్కువగా పనిచేస్తున్న ఈ ప్రాంతంలో వ్యాపార కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా త్వరలోనే ఓ ఉత్తర్వును జారీ చేస్తానని ట్రంప్ ఇటీవల పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో లాస్‌ఏంజెలెస్ ప్రాంతంలోని వ్యవసాయ పరిశ్రమలు, హోటళ్లు, రెస్టరంట్‌లలో సోదాలు నిలిపివేయాలని ఆయన ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈమేరకు పలు మీడియాల్లో కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇమిగ్రేషన్ మరియు కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లోని ఓ సీనియర్ అధికారి కూడా వ్యవసాయ పరిశ్రమలు, హోటళ్లలో తనిఖీలను వెంటనే ఆపేయాలని స్థానిక అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికార ప్రకటన వెలువడలేదు. అక్రమ వలసదారులను అరెస్టు చేసేందుకు ఐసీఈ అధికారులు గత శుక్రవారం లాస్ ఏంజెలెస్‌లోని డౌన్‌టౌన్‌లో సోదాలు ప్రారంభించడంతో ఈ నిరసనలు ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత అవి దేశమంతటా విస్తరించాయి. ఈక్రమంలో లాస్‌ఏంజెలెస్‌లో ట్రంప్ భారీస్థాయిలో నేషనల్ గార్డ్‌లను మోహరించారు. దీంతో ఉద్రిక్తతలు మరింత తీవ్రతరమయ్యాయి. ఈ నేపథ్యంలో నిరసనకారులను అడ్డుకునేందుకు మరో 2వేల మంది నేషనల్ గార్డులను మోహరించాలని ట్రంప్ ఆదేశాలు జారీ చేశారు. ఈ చర్యను కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్, లాస్ ఏంజెలెస్ మేయర్ కరెన్ బాస్‌తోపాటు స్థానిక పోలీసు అధికారులు వ్యతిరేకించారు. గవిన్ దీనిపై ఫెడరల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. అధ్యక్షుడి ఆదేశాలు చెల్లవని న్యాయస్థానం తేల్చిచెప్పింది.

## ఇరాన్, ఇజ్రాయెల్ ఉద్రిక్తతలపై
# భారత్ ఆందోళన చట్టబద్ధమే

### ఇజ్రాయెల్ రాయబారి



**ఇజ్రాయెల్ :** ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడినట్లు భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య మధ్యవర్తిత్వం వహించి.. ఉద్రిక్తతలను తగ్గించే సామర్థ్యం మోదీకి ఉందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. యుద్ధం ముగింపుపై ఇరుదేశాల నేతలతో చర్చలు జరిపే అవకాశం భారత్‌కు ఉందని రూవెన్ అజార్ అన్నారు. భారత్ తమకు మిత్రదేశం కాబట్టి ఈ పరిస్థితులపై న్యూదిల్లీ వ్యక్తం చేస్తున్న చట్టబద్ధమైన ఆందోళనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఇజ్రాయెల్ చర్యల గురించి వివరించడానికి నెతన్యాహు శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీకి ఫోన్ చేసి.. మాట్లాడారని రూవెన్ అజార్ అన్నారు. ఇజ్రాయెల్‌ను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో టెహ్రాన్ అణు బాంబులను, బాలిస్టిక్ క్షిపణులను పెద్ద మొత్తంలో తయారుచేస్తోందని.. దానివల్ల తమకు అస్తిత్వ ముప్పు పొంచి ఉందన్నారు. అందువల్లే వాటిని ధ్వంసం చేయడానికి ఇరాన్‌లోని అణుస్థావరాలే లక్ష్యంగా దాడులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులు రావాలని.. ప్రపంచంలోని ఏ దేశమూ కోరుకోదని అన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వేరే మార్గం లేకపోవడంతో ఇజ్రాయెల్ ఈ చర్యలకు ఉపక్రమించిందని తెలిపారు. రాబోయే ఆరేళ్లలో 20,000 బాలిస్టిక్ క్షిపణులను తయారుచేయాలని ఇరాన్ యోచిస్తోందని .. అందుకుగానూ వారు అతిపెద్ద ఆయుధశాల నిర్మించారని నిఘా వర్గాలు తెలిపినట్లు రూవెన్ అజార్ పేర్కొన్నారు. యురేనియంను బాంబుల తయారీకి ఉపయోగించకుండా అడ్డుకోవడమే తమ ప్రథమ లక్ష్యమని తెలిపారు. ఇకనైనా వారు ఇజ్రాయెల్‌పై కుట్రలను ఆపుతారని భావిస్తున్నామన్నారు. అమెరికాతో అణుచర్చలు జరపాలని ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ ఎన్నిసార్లు ప్రతిపాదనలు చేసినప్పటికీ టెహ్రాన్ స్పందించకపోవడంతో తాము ఈ దాడులు మొదలుపెట్టామన్నారు. మరోవైపు ట్రంప్ సైతం ఈ విషయంలో ఇరాన్‌ను మరోసారి హెచ్చరించారు. తమతో అణుఒప్పందం చేసుకోకపోతే.. ఇజ్రాయెల్ దాడులు మరింత తీవ్రమవుతాయని స్పష్టం చేశారు. పరిస్థితి చేయి దాటకముందే దీనిపై నిర్ణయం తీసుకోవాలన్నారు.

## 'దాడులు కొనసాగితే.. టెహ్రాన్ శిథిలమవుతుంది'

### ఇజ్రాయెల్ హెచ్చరిక



**ఇజ్రాయెల్ :** ఆపరేషన్ రైజింగ్ లయన్ పేరుతో ఇరాన్‌లోని అణుస్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. దీంతో ఇరాన్ సైతం ఇజ్రాయెల్‌పై ప్రతిదాడులు చేస్తోంది. తొలుత భారీ సంఖ్యలో డ్రోన్లను టెల్‌అవీవ్‌పైకి పంపిన టెహ్రాన్..ఆ తర్వాత వందల సంఖ్యలో క్షిపణులను ప్రయోగించింది. దీంతో ఆగ్రహానికి గురైన ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ ఇరాన్‌పై తీవ్రంగా మండిపడ్డారు. ఇరాన్ తమ దేశంపై క్షిపణులను ప్రయోగించడం కొనసాగిస్తే.. టెహ్రాన్ తగలబడిపోతుందని హెచ్చరించారు. పౌర నివాసాలపై దాడులు చేసి..వారికి హాని తలపెట్టాలని చూస్తే..ఆ దేశం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఖమేనీ తన చర్యలతో తన దేశంలోని ప్రజలను ప్రమాదంలోకి నెట్టేస్తున్నారని అన్నారు.

### టెహ్రాన్‌పై దాడులకు వైమానిక దళం సిద్ధం: ఐడీఎఫ్

ఇరాన్‌లోని పలు లక్ష్యాలపై తిరిగి దాడులు చేయడానికి తమదేశ వైమానిక దళం సిద్ధంగా ఉందని ఐడీఎఫ్ తెలిపింది. ఈ మేరకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. ఇందుకోసం ఐడీఎఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఇయాల్ జమీర్, ఇజ్రాయెల్ వైమానిక దళ చీఫ్ మేజర్ జనరల్ టోమర్ బార్ పరిస్థితులను అంచనా వేస్తున్నట్లు సమాచారం. కాగా టెల్‌అవీవ్‌పై టెహ్రాన్ చేస్తున్న దాడుల్లో ముగ్గురు ఇజ్రాయెల్ పౌరులు ప్రాణాలు కోల్పోయారు.

**అమెరికా, ఫ్రాన్స్, యూకే స్థావరాలపై దాడులు చేస్తాం: ఇరాన్**

తాము ఇజ్రాయెల్‌పై చేస్తున్న దాడులను ఆపడానికి అమెరికా, యూకే, ఫ్రాన్స్ వంటి దేశాలు ఇజ్రాయెల్‌కు సహకరిస్తే పశ్చిమాసియాలోని ఆయా దేశాల స్థావరాలను, నౌకలను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. తమపై దాడులకు పాల్పడుతున్న టెల్‌అవీవ్‌కు వాషింగ్టన్ మద్దతునిస్తుందని ఇప్పటికే ఇరాన్ అధికారులు ఆరోపించిన విషయం తెలిసిందే. కాగా అవన్నీ తప్పుడు ప్రచారాలని అగ్రరాజ్యం కొట్టిపడేసింది. ఆపరేషన్ 'రైజింగ్ లయన్' పేరుతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ గురువారం అర్ధరాత్రి భీకరమైన దాడులు చేసింది. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన పలు కీలక మిలిటరీ అధికారులు, అణుశాస్త్రవేత్తలు మృతి చెందారు. దీనికి ప్రతీకారంగా ఇరాన్ కూడా భారీ దాడులకు దిగింది. శుక్రవారం అర్ధరాత్రి టెల్ అవీవ్, జెరూసలెం లక్ష్యంగా ఇరాన్ మిస్సైళ్లతో విరుచుకుపడింది. ఆయా ప్రాంతాల్లో డజన్ల కొద్దీ క్షిపణి దాడులు చేసింది. శనివారం ఇరుదేశాలు మళ్లీ ఒకదానిపై ఒకటి డ్రోన్లతో విరుచుకుపడ్డాయి.

## జీ-7 సదస్సుకు హాజరుకానున్న ప్రధాని



**న్యూఢిల్లీ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. సైప్రస్, కెనడా, క్రొయేషియా దేశాలలో ఐదురోజులపాటు పర్యటించనున్నారని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ శనివారం అధికారికంగా వెల్లడించింది. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడోలైడ్స్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ ఆ దేశంలో జూన్ 15-16 తేదీల్లో పర్యటించనున్నారు. దాదాపు రెండు దశాబ్దాల తరువాత అక్కడ పర్యటించనున్న మొదటి భారత ప్రధాని మోదీనే. పర్యటనలో భాగంగా సైప్రస్ అధ్యక్షుడితో ఆయన చర్చలు జరపనున్నారు. దీనితోపాటు వ్యాపారవేత్త లను ఉద్దేశించి కీలక ప్రసంగం చేయనున్నారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింతగా పెంచుకోవడం, మధ్యధరా ప్రాంతంతో భారత్ సంబం ధాల బలోపేతం, యూరోపియన్ యూనియన్‌లతో సంబంధాలను మరింత పటిష్టం చేసే విధంగా ఇరు దేశాల మధ్య ఒప్పందాలు జరగనున్నాయి. అక్కడి నుంచి ప్రధాని మోదీ నేరుగా కెనడాకు వెళ్తారు. ఆ దేశ ప్రధాని మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు జూన్ 16-17న కననాస్కిస్‌లో జరగనున్న జీ-7 సదస్సుకు హాజరుకానున్నారు. ఈ సదస్సులో ప్రధాని మోదీ పాల్గొనడం వరుసగా ఆరో సారి. ఇందులో భాగంగా జీ-7 దేశాధినేతలతో సమావేశం కానున్నారు. జీ-7 దేశాలలోని అంతర్జాతీయ సంస్థల అధిపతులతో ఇంధన భద్రత, కీలక అంతర్జాతీయ సమస్యలు, సాంకేతికత, ఆవిష్కరణలు, ముఖ్యంగా ఏఐతో అను సంధానం, క్వాంటమ్ సంబంధిత అంశాల గురించి చర్చలు జరపనున్నారు. తిరుగు ప్రయాణంలో భాగంగా జూన్ 18న మోదీ ఐరోపాలోని క్రొయేషియాకు వెళ్లనున్నారు. ఆ దేశంలో భారత ప్రధాని పర్యటించడం ఇదే తొలిసారి.

## 19న శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర



**న్యూఢిల్లీ :** భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్రకు సంబంధించిన కొత్త తేదీ ఖరారైంది. సాంకేతిక సమస్యలతో ఈ రోదసియాత్ర పలుమార్లు వాయిదా పడుతూ వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా భారత అంతరిక్ష పరిశో ధన సంస్థ (ఇస్రో) కొత్త తేదీని ప్రకటించింది. యాక్సియం-4 కింద మరో ముగ్గురు ఆస్ట్రోనాట్లతో కలిసి శుభాంశు జూన్ 19న రోదసియాత్రకు బయలు దేరనున్నట్లు ఇస్రో తెలిపింది. ఈనెల 11న ప్రయోగానికి ముందు రాకెట్‌లో లిక్విడ్ ఆక్సిజన్ లీక్ అవుతున్నట్లు అధికారులు గుర్తించిన సంగతి తెలిసిందే. ఈ సమస్యను విజయవంతంగా పరిష్కరించామని ఇస్రో వెల్లడించింది. ఈనేపథ్యంలో కొత్త ప్రయోగ తేదీని ప్రకటించింది. అమెరికాకు చెందిన వాణిజ్య అంతరిక్ష సంస్థ 'యాక్సియం స్పేస్' ఈ మిషన్‌ను నిర్వహిస్తోంది. ఇస్రో, అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా), ఐరోపా అంతరిక్ష సంస్థ (ఈఎస్ఏ)లు ఇందులో భాగస్వామ్యం వహిస్తున్నాయి. ఈ స్పేస్ క్యాప్సూల్‌ను ఫాల్కన్-9 రాకెట్ నింగిలోకి మోసుకెళుతోంది. ఇందులో శుభాంశు మిషన్ పైలట్ బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ ప్రయోగం తొలుత మే 29న జరగాల్సి ఉంది. అయితే, వాతావరణం అనుకూలించకపోవడం, సాంకేతిక సమస్య తలెత్తడం వంటి కారణాలతో పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. ఇక, భూమి నుంచి బయల్దేరిన 28 గంటల తర్వాత ఈ వ్యోమనౌక.. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)తో అనుసంధానమవుతుంది. శుభాంశు బృందం అక్కడే 14 రోజుల పాటు ఉంటుంది. భారరహిత స్థితిలో పలు ప్రయోగాలు నిర్వహించడంతో పాటు ప్రధాని మోదీ, పాఠశాల విద్యార్థులు, ఇతరులతో ముచ్చటిస్తారు.

### ఆపరేషన్ రైజింగ్ లయన్.. ఇరాన్ కీలక అధికారులు మృతి



**ఇరాన్ :** ఇరాన్- ఇజ్రాయెల్‌ల మధ్య కొనసాగుతున్న యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ మరో ఇద్దరు కీలకమైన అధికారులను కోల్పోయింది. స్థానిక మీడియాలో ఈ మేరకు వివరాలను తెలియజేసింది. ఆపరేషన్ రైజింగ్ లయన్ పేరుతో ఇరాన్‌లోని అణుస్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన సాయుధ దళాల జనరల్ స్టాఫ్ నిఘా డిప్యూటీ జనరల్ ఘోలామ్రేజా మెహ్రాబీ, ఆపరేషన్ డిప్యూటీ జనరల్ మెహదీ రబ్బానీలు మృతి చెందినట్లు స్థానిక మీడియాలో వార్తలు వస్తున్నాయి. అయితే, దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఆపరేషన్ 'రైజింగ్ లయన్' పేరుతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ గురువారం అర్ధరాత్రి భీకరమైన దాడులు చేసింది. ఈ దాడుల్లో ఇరానియన్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) చీఫ్ మేజర్ జనరల్ హొస్సేన్ సలామీ, సైనిక దళాల పర్యవేక్షకుడు జనరల్ మహమ్మద్ బాఘేరి, దేశ క్షిపణి కార్యక్రమ అధిపతి జనరల్ అమీర్‌అలీ హాజీజదే మృతిచెందిన సంగతి తెలిసిందే. పలువురు అణుశాస్త్రవేత్తలు కూడా మరణించారు. దీనికి ప్రతిగా ఇరాన్ కూడా ఎదురుదాడులకు దిగింది. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రతరమయ్యాయి. శనివారం కూడా టెహ్రాన్ లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు జరుపుతుండగా.. టెల్‌అవీవ్ లక్ష్యంగా ఇరాన్ మిస్సైళ్లను ప్రయోగించింది.

## విమాన ప్రమాదం.. ఆడిట్ నిర్వహణకు ఎయిరిండియా బోర్డు ఆదేశం

**న్యూఢిల్లీ :** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదం ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై యావత్ ప్రపంచం దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోంది. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఎయిరిండియా బోర్డు అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. తమ అన్ని విమానాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. విమాన ప్రమాదంలో 274 మంది ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో అంతర్గత ఆడిట్ నిర్వహించాలని ఎయిరిండియా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. విమానాల కండీషన్, వాటి నిర్వహణ పద్ధతులు, ఇలా వివిధ శాఖలపై సమీక్ష కూడా చేయించడంపై ఎయిరిండియా ఛైర్మన్, సీఈవో సిద్ధమయ్యారు. భద్రతా ఆడిట్ నిర్వహణకు ఎయిరిండియా బోర్డును ఆదేశించారని తెలుస్తోంది. అంతేకాకుండా ఈ ఘటనపై మరో విచారణ చేపట్టనుంది. ఉద్యోగుల నైపుణ్యాలను మెరుగుపరచడం, వారిని సమగ్ర శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించడంపై దృష్టి పెట్టింది. విమాన ప్రమాదంపై అన్ని దర్యాప్తు సంస్థలకు సహకరిస్తామని ఎయిరిండియా పేర్కొంది. కాగా.. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా ఫ్లయిట్ నెంబర్ ఏఐ-171 విమానం ఇటీవల కూలిపోయిన సంగతి తెలిసిందే. రన్‌వే నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ప్రమాదానికి గురైంది. మేఘాని నగర్ ఘోడాసర్ క్యాంప్ ప్రాంతంలో విమానం ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ప్రమాదంలో 274 మంది మృతి చెందారు. అయితే.. ఈ ప్రమాదంపై స్వయంగా దర్యాప్తు చేపట్టేందుకు ఎయిరిండియా సిద్ధమైంది. ఇలాంటి ప్రమాదాలను నివారించేందుకు సమగ్ర తనిఖీలు చేపడుతోంది.




# దక్షిణాఫ్రికాదే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్

**లార్డ్స్:** దక్షిణాఫ్రికా జట్టు వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకుంది. లార్డ్స్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బవుమా సేన విజేతగా నిలిచింది. 213/2 స్కోరుతో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన సఫారీ జట్టు మరో మూడు వికెట్లు కోల్పోయి 83.4 ఓవర్లలో 285 పరుగులు చేసింది. ఐడెన్ మార్‌క్రమ్ (136) అద్భుత శతకం సాధించాడు. విజయానికి 6 పరుగుల దూరంలో ఉండగా హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో ట్రావిస్ హెడ్ చక్కటి డైవింగ్ క్యాచ్ అందుకోవడంతో అయిదో వికెట్‌గా వెనుదిరిగాడు. అప్పటికే విజయం ఖాయం కావడంతో తర్వాత వచ్చిన బ్యాటర్ పని పూర్తి చేశాడు. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా జట్టు 212 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా జట్టు 138 పరుగులకే కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ జట్టు 207 పరుగులు చేసింది. 282 పరుగుల లక్ష్యంతో




బరిలోకి దిగిన సఫారీ జట్టు అనూహ్యంగా పుంజుకుంది. బౌలర్లకు సహకరిం చిన పిచ్‌పై ఐడెన్ మార్‌క్రమ్, తెంబా బవుమా (66) పోరాట పటిమ ప్రదర్శించారు. బవుమా ఔటైనా.. మార్‌క్రమ్ దాదాపు చివరి వరకు క్రీజులో ఉండి దక్షిణాఫ్రికా జట్టుకు చిరస్మరణీ యమైన గెలుపును అందించడంలో కీలక పాత్ర పోషించాడు. 5 వికెట్ల తేడాతో లంచ్ బ్రేక్‌కు ముందే మ్యాచ్‌ను గెలిచి, వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్‌ను దక్షిణాఫ్రికా జట్టు కైవసం చేసుకుంది. అద్భుత ఇన్నింగ్స్ ఆడిన ఐడెన్ మార్‌క్రమ్ 'ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్'గా నిలిచాడు. చివరిసారిగా 1998లో ఛాంపియన్స్ ట్రోఫీని సఫారీ జట్టు గెలుచుకుంది. ఇప్పుడు 27 ఏళ్ల తర్వాత మరోసారి ఐసీసీ టైటిల్‌ను నెగ్గింది. ఫైనల్స్ లో ఒత్తిడికి గురై ఓడిపోతుందని తన మీద ఉన్న అపవాదును దక్షిణాఫ్రికా జట్టు ఈ విజయంతో తొలగించుకుంది.

## బౌండరీ రోప్ అవతల క్యాచ్‌లు
### - నిబంధనలో మార్పు




బౌండరీ రోప్ వద్ద క్యాచ్‌ల విషయంలో అంతర్జాతీయ క్రికెట్‌లో ఐసీసీ కొత్త నిబంధనను త్వరలో అమల్లోకి తీసుకురానుంది. దీన్ని బట్టి బౌ ండరీ లైన్ బయట గాల్లోకి ఎగిరి బంతిని పట్టుకునే 'బన్నీ–హాప్స్' క్యాచ్‌లను ఇకపై పరిగణనలోకి తీసుకోరు. కానీ బౌండరీ లోపల నుంచి బంతిని నెట్టి, ఆపై బయటికి వెళ్లి.. తిరిగి లోపలకు వచ్చి క్యాచ్‌ను పూర్తి చేసేందుకు మాత్రం ఎప్పటిలానే అనుమతి ఉ ంటుంది. అంటే ఇకపై బౌండరీ రోప్ బయట బంతిని ఒకటి కంటే ఎక్కువ సార్లు గాల్లోకి ఎగురవేయడం కుదరదన్నమాట. ఇలాంటి క్యాచ్‌లు సరైనవి కావంటూ పలువురు క్రికెట్ అభిమానులు, విశ్లేషకుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఐసీసీ ఈ నిబంధనను తీసుకొచ్చింది. గతంలో బిగ్‌బాష్ లీగ్‌లోనూ ఫీల్డర్లు ఇలాంటి కొన్ని క్యాచ్‌లు పట్టారు. దీంతో అంపైర్లు బ్యాటర్లను అవుట్‌గా ప్రకటించారు. అప్పుడు కూడా ఈ క్యాచ్‌లు అన్యాయంగా ఉన్నాయంటూ పలువురు అభిమానులు అభ్యంతరం తెలిపారు. ఈ కొత్త నిబంధన అమల్లోకి వచ్చాక ఇకపై అలాంటి క్యాచ్‌లు లీగల్ కాదు. ఈ కొత్త నిబంధన ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంఫియన్ షిప్ నూతన సైకిల్‌లో భాగంగా జూన్ 17 నుంచి శ్రీలంక, బంగ్లాదేశ్ మధ్య జరగనున్న మొదటి టెస్ట్ మ్యాచ్ నుంచి అమల్లోకి రానుంది. అధికారికంగా మాత్రం అక్టోబర్ 2026 నుంచి అమల్లోకి రానుంది.

## తెందూల్కర్ - అండర్సన్ ట్రోఫీ ప్రారంభోత్సవం వాయిదా

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గురువారం విమాన ప్రమాదం జరిగిన నేపథ్యంలో తెందూల్కర్–అండర్సన్ ట్రోఫీ ప్రారంభోత్సవం వాయిదా పడింది. ట్రోఫీ నామకరణ కార్యక్రమాన్ని మొదట జూన్ 14న (శనివారం) లార్డ్స్ వేదికగా నిర్వహించాలనుకున్నారు. అయితే ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డ్, బీసీసీఐ ఆధ్వర్యంలో సంయుక్తంగా జరగాల్సిన కార్యక్రమం వాయిదా పడింది. కొత్త తేదీని త్వరలో ప్రకటించే అవకాశం ఉంది. తేదీ విషయమై ఇప్పటికైతే ఈసీబీ, బీసీసీఐ అధికారులు ఇంకా ఏ నిర్ణయమూ తీసుకోలేదు! గురువారం మధ్యాహ్నం అహ్మదాబాద్ విమానాశ్రయం సమీపంలో ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో 275 మంది వరకు తమ ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో శనివారం లార్డ్స్‌లో జరగాల్సిన తెందూల్కర్– అండర్సన్ ట్రోఫీ నామకరణ కార్యక్రమాన్ని చివరి నిముషంలో వాయిదా వేశారు. ఇంతకు ముందు ఇంగ్లండ్, భారత్ మధ్య జరిగే టెస్ట్ సిరీస్ విజేతకు పటౌడీ ట్రోఫీ ఇచ్చేవారు. ఇటీవలే ఆ పేరును రిటైర్ చేశారు. దాని స్థానంలోనే తెందూల్కర్– అండర్సన్ ట్రోఫీ ఇవ్వాలనుకున్నారు.

## ఆధార్ ఫ్రీ డాక్యుమెంట్ల అప్‌లోడ్
# గడువు పొడిగింపు




ఆధార్‌ను అప్‌డేట్ చేసుకునేందుకు ఇచ్చిన గడువును భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ మరోసారి పొడిగించింది. సంబంధిత డాక్యుమెంట్లను ఉచితంగా అప్‌లోడ్ చేసుకునేం దుకు ఉన్న గడువు నేటితో (జూన్ 14) ముగియనున్న వేళ ఈ నిర్ణయం తీసుకుంది. 2026 జూన్ 14 వరకు అంటే మరో ఏడాది పాటు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ఆధార్‌ను అప్‌డేటెడ్‌గా ఉంచేందుకు డాక్యుమెంట్లను ఉచిత అప్‌లోడ్‌కు మరోసారి అవకాశం కల్పిస్తున్నామని, దీనివల్ల లక్షలాది మందికి ప్రయోజనం కలుగుతుందని ఉడాయ్ తెలిపింది. మై ఆధార్ పోర్టల్ ద్వారా ఉచితంగా ఈ డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేసుకోవచ్చు. ఆధార్ డేటాబేస్‌లో ప్రస్తుత, కచ్చితమైన సమాచారాన్ని ఉ ంచేందుకు గానూ ఆధార్ హోల్డర్లకు ఉడాయ్ ఈ అవకాశం కల్పిస్తోంది. ఇందుకోసం మీ గుర్తింపు రుజువు, చిరునామా రుజువు పత్రాలను ఆన్‌లైన్‌లో ఉచితంగా అప్‌డేట్ చేసుకునేందుకు అనుమతి స్తోంది. వివాహం, ఉన్నత చదువులు, ఇతర కారణాల వల్ల కొందరు వేర్వేరు ప్రదేశా లకు మారుతుం టారు. అలాంటి వారికి ఇది ఉ పయుక్తంగా ఉంటుంది. అలాగే, ఎవరైతే ఆధార్ తీసుకుని పదేళ్లు పూర్తయ్యి ఉంటుందో వారు కూడా తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని ఉడాయ్ ఇదివరకే సూచించింది. గతంలో ఆయా వివరాల అప్‌డేట్ చేసేందుకు ఆధార్ కేంద్రాల్లో రూ. 50 రుసుము చెల్లించాల్సి వచ్చేది.

### ఆన్‌లైన్‌లో ఎలా?

- ఆన్‌లైన్‌లో ఆధార్ ఉచిత అప్‌డేట్ చేయాలంటే ముందుగా యూఐడీఏఐ వెబ్‌సైట్‌లో ఆధార్ నంబర్‌తో లాగిన్ కావాలి.
- రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు ఓటీపీతో లాగిన్ అయిన వెంటనే అప్పటికే ఉన్న మీ వివరాలు స్క్రీన్‌పై కనిపిస్తాయి.
- అందులోని వివరాలన్నీ సరైనవో కాదో చెక్ చేసుకోండి. ఒకవేళ వీటిలో సవరణ ఉంటే చేసేయాలి. లేదా ఉన్న వివరాలను వెరిఫై చేసుకొని నెక్ట్స్‌పై క్లిక్ చేయాలి.
- తర్వాత కనిపించే డ్రాప్‌డౌన్ లిస్ట్ సాయంతో డాక్యుమెంట్లను ఎంచుకోవాలి. ఆయా డాక్యుమెంట్ల స్కాన్డ్ కాపీలను అప్‌లోడ్ చేసి సబ్మిట్‌పై క్లిక్ చేయాలి.
- 14 అంకెల 'అప్‌డేట్ రిక్వెస్ట్ నంబర్' వస్తుంది. దీని ద్వారా అప్‌డేట్ స్టేటస్ ఎక్కడి వరకు వచ్చిందో ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవచ్చు.



## గుడ్ న్యూస్
## హోమ్‌లోన్ వడ్డీ రేట్లు
# తగ్గించిన ఎస్‌బీఐ..
### తాజా రేట్లు ఇవే

దిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రుణ గ్రహీతలకు గుడ్‌న్యూస్ చెప్పింది. ఆర్‌బీఐ రెపో రేటును తగ్గించిన నేపథ్యంలో హోమ్‌లోన్‌లపై వడ్డీని తగ్గించింది. ఎక్స్‌టర్నల్ బెంచ్ మార్క్ ఆధారిత లెండింగ్ రేట్ రేటులో 50 బేసిస్ పాయింట్ల మేర కోత పెట్టింది. సవరించిన వడ్డీ రేట్లు జూన్ 15 నుంచి అమల్లోకి రానున్నాయి. ఆర్‌బీఐ ప్రకటన నేపథ్యంలో ఇప్పటికే పలు ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు వడ్డీ రేట్ల ప్రయోజనాన్ని వినియోగదారులకు బదిలీ చేస్తున్నట్లు ప్రకటించాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజాగా 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో రెపో రేటు 5.50 శాతానికి దిగొచ్చింది. ఈ నేపథ్యంలో రుణ రేట్లను ఎస్‌బీ సవరించింది. ఎక్స్‌టర్నల్ బెంచ్ మార్క్ (ఈబీఆర్) 8.65 శాతం నుంచి 8.15 శాతానికి తగ్గించింది. హోమ్‌లోన్, ఎంఎస్ఎంఈ, రిజర్వ్ బ్యాంక్ సూచించిన కొన్ని రుణాలకు ఈబీఎల్ఆర్ వర్తిస్తుంది. రుణ గ్రహీత సిబిల్ స్కోరు ఆధారంగా హోమ్‌లోన్ 7.50 శాతం నుంచి 8.45 శాతం మధ్య లభిస్తాయి. ఇప్పటికే రుణాలు తీసుకున్న వారితో పాటు, కొత్తగా రుణాలు తీసుకునే వారికీ ప్రయోజనం చేకూరనుంది. గృహ రుణాలకు రెపోరేటును అనుసంధానం చేసేందుకు ఈబీఎల్ఆర్ విధానాన్ని 2019 అక్టోబర్ 1 నుంచి ఎస్‌బీఐ అనుసరిస్తోంది.




### స్పెషల్ ఎఫ్‌డీ వడ్డీ రేట్లు కోత

హోమ్‌లోన్ వడ్డీ రేట్లతో పాటు స్పెషల్ ఎఫ్‌డీ స్కీమ్ 'అమృత్ వృష్టి' వడ్డీ రేట్లనూ ఎస్‌బీఐ సవరించింది. ఈ స్కీమ్‌లో ఇది వరకు ఇస్తున్న వడ్డీపై 25 బేసిస్ పాయింట్లను కోత పెట్టింది. ఇకపై 444 రోజుల కాలవ్యవధి కలిగిన ఈ పథకంలో సాధారణ పౌరులకు 6.60 శాతం వడ్డీ లభిస్తుంది. జూన్ 15 నుంచి ఈ రేట్లు అమల్లోకి రానున్నాయి. సీనియర్ సిటిజన్లకు 7.10 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 7.20 శాతం వడ్డీ లభిస్తుంది. ఇతర ఎఫ్‌డీ స్కీమ్‌లపై 3.3 శాతం నుంచి గరిష్ఠంగా 6.7 శాతం వరకు వడ్డీ ఇస్తోంది.

## ప్రపంచ కుబేరుల జాబితా.. రెండో స్థానం కోల్పోయిన జెఫ్ బెజోస్

అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ ప్రపంచ కుబేరుల జాబితాలో రెండో స్థానాన్ని కోల్పోయారు. ఆ స్థానాన్ని ఒరాకిల్ సహ వ్యవస్థాపకుడు లారీ ఎల్లిసన్ సొంతం చేసుకున్నారు. 243 బిలియన్ డాలర్ల సంపదతో ఎల్లిసన్ రెండో ధనవంతుడిగా నిలిచారు. ఈ విషయాన్ని ఫోర్బ్స్ వరల్డ్ బిలియనీర్స్ జాబితాలో తెలిపింది. మేతో ముగిసిన త్రైమాసికంలో ఒరాకిల్ అంచనాలను మించి ఆదాయం, లాభాలు సాధించింది. మెరుగైన వృద్ధిని సొంతం చేసుకుంది. దీంతో కంపెనీ షేర్లు పుంజుకున్నాయి. గురువారం ట్రేడింగ్



సెషన్‌లో ఏకంగా 13 శాతం పెరిగి, మొదటిసారిగా 200 డాలర్లకు చేరాయి. ఒక్క రోజులో ఎల్లిసన్ సంపద 26 బిలియన్ డాలర్లు పెరిగింది. దీంతో ఆయన మొత్తం సంపద 243 బిలియన్ డాలర్లకు చేరింది. ఫోర్బ్స్ వరల్డ్ బిలియనీర్స్ జాబితా ప్రకారం.. బెజోస్ సంపద 228 బిలియన్ డాలర్లు, మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ సంపద 239 బిలియన్ డాలర్లుగా ఉంది. వీరిని అధిగమించి ఎల్లిసన్ రెండో స్థానం సొంతం చేసుకున్నారు. ఈ జాబితాలో టెస్లా అధినేత ఎలాన్ మస్క్ 407 బిలియన్ డాలర్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు.



### బంగారు ఆభరణాలు, వెండి తాకట్టు రుణాలకు
## ఆర్‌బీఐ కొత్త మార్గదర్శకాలు

**హైదరాబాద్:** బంగారం, వెండి తాకట్టుపై బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల సొమ్ముతో మనీలాండరింగ్ చేస్తున్నారా అనేది ఎప్పటికప్పుడు పక్కాగా బ్యాంకులు తనిఖీ చేయాలని రిజర్వు బ్యాంకు తాజాగా జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొంది. 'ఆ సొత్తు ఆ వ్యక్తి సొంతదేనా కాదా అనేది తెలుసుకోడానికి రసీదులు పరిశీలించాలి. అవి లేకపోతే అది సొంతదే అని రాతపూర్వక పత్రాలు తీసుకోవాలి. బంగారం తాకట్టు పెట్టుకుని సులభంగా రుణాలిచ్చేస్తామని మోసపూరిత ప్రకటనలు ఏవీ జారీచేయవద్దు' అని అన్ని బ్యాంకులకు, ఇతర ఆర్థిక సంస్థలకు స్పష్టం చేసింది. బంగారం తాకట్టు రుణాల సొమ్ము దుర్వినియోగమవుతున్నట్లు, రుణాల మంజూరులో పలు సంస్థలు నిబంధనలకు నీళ్లొదిలేస్తున్నాయనే ఆరోపణల నేపథ్యంలో రిజర్వు బ్యాంకు కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది.

### మరిన్ని ముఖ్యాంశాలు ఇవీ...

- ఇక నుంచి ఏ ఒక్క వ్యక్తి పేరుతో కిలో బంగారు ఆభరణాలు, పది కిలోల వెండి ఆభరణాలకు మించి తాకట్టు పెట్టుకోకూడదు.
- ఆభరణాల విలువలో ఎంత రుణం ఇవ్వాలనేది తీసుకునే రుణ మొత్తం ఆధారంగా నిర్ణయమవుతుంది. ఉదాహరణకు రూ. 2.50 లక్షల లోపు రుణం అడిగితే... తాకట్టు పెట్టిన ఆభరణాల విలువ మొత్తంలో 85 శాతం వరకూ ఇవ్వాలి. అంటే ఆభరణం విలువ సుమారు 2.95 లక్షలు ఉంటే సరిపోతుంది. రూ. 2.50 లక్షల నుంచి రూ. 5 లక్షల లోపు అడిగితే 80 శాతం, రూ. 5 లక్షలకు మించి రుణం అడిగితే ఆభరణాల విలువలో 75 శాతం మాత్రమే బ్యాంకు లేదా ఇతర ఆర్థిక సంస్థలు రుణాలివ్వాలి.
- బంగారం నాణేలు, బిస్కెట్లు అయితే 50 గ్రాములకు.. వెండి అయితే 500 గ్రాములకు మించి తాకట్టుకు స్వీకరించకూడదు.
- అనేక బంగారం తాకట్టు రుణాలు ఒకేసారి తీసుకుంటుంటే వాటిని తనిఖీ చేసి విచారించాలి.
- అప్పుగా ఇచ్చే సొమ్మును రుణగ్రహీత బ్యాంకు ఖాతాలోనే జమ చేయాలి.
- రుణం తీసుకున్న తేదీ నుంచి ఏడాదిలోగా తిరిగి చెల్లించాలి. చెల్లించకపోతే తాకట్టు సొత్తును వేలం వేయాలి. వేలం ప్రక్రియను రెండుసార్లు నిర్వహించాలి. మొదట.. బ్యాంకు ఉన్న జిల్లా పరిధిలో, అప్పుడు పూర్తికాకపోతే రెండోసారి.. ఆన్‌లైన్ విధానంలో లేదా పక్క జిల్లాలోనైనా నిర్వహించవచ్చు.
- రుణ బకాయి చెల్లించినా రెండేళ్లలోగా సొత్తును తిరిగి తీసుకెళ్లకపోతే బ్యాంకు... పాలకమండలికి వివరించాలి. రుణగ్రహీతలు, వారి వారసులు ఎక్కడ ఉన్నారో తెలుసుకుని సమాచారం పంపాలి.

## నేడు కుబేర మూవీ గ్రాండ్ ఈవెంట్

శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తమిళ నటుడు ధనుష్, టాలీవుడ్ నటుడు నాగార్జున, రష్మిక మందన్నా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం కుబేర టీజర్ విడుదలకు రంగం సిద్దం అయ్యింది. హైదరాబాద్ వేదికగా ఆదవారం ఈవెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వచ్చే వారం రిలీజ్ కాబోతున్న కుబేర సినిమాపై ఆడియెన్స్‌లో ఉన్న ఎక్స్‌పెక్టేషన్స్ అన్నీ ఇన్నీ కావు. ఎప్పుడెప్పుడు సినిమా రిలీజవుతుందా అని ఉత్కంఠగా వేయిట్ చేస్తున్నారు.పాన్ ఇండియా లెవల్లో తెరకెక్కుతున్న ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర సినిమాస్ , అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తుండగా. ఈ జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే.. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకను వాయిదా వేసిన విషయం తెలిసిందే. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం జరగడంతో ఈ వేడుకను వాయిదా వేసుకున్నారు. తాజాగా ఈ వేడుకకి సంబంధించి కొత్త డేట్‌ని ప్రకటించారు. కుబేరా ప్రీ రిలీజ్ వేడుకను జూన్ 15న హైదరాబాద్‌లో గ్రాండ్‌గా నిర్వహించ బోతున్నట్లు తెలిపారు. అలాగే ఈ మూవీ నుంచి రేపు -ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు- చిత్రయూనిట్ ప్రకటించింది. ఈ కార్యక్రమానికి చిత్రబృందంతో పాటు పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉంది. ట్రైలర్ లాంచ్‌తో సినిమాపై మరింత హైప్ పెరిగేలా ప్లాన్ చేస్తున్నారు మేకర్స్.



## కావ్యా మారన్‌తో పెళ్లంటూ వార్తలు

### స్పందించిన అనిరుధ్

సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు సీఈవోగా వ్యవహరిస్తున్న కావ్యా మారన్ కొంతకాలంగా రిలేషన్‌షిప్‌లో ఉన్నారని, త్వరలోనే పెళ్లి చేసుకోనున్నారని కోలీవుడ్ మీడియాలో వార్తలు రావడం హాట్‌టాపిక్ అయింది. సామాజిక మాధ్యమాల్లోనూ చర్చ జరిగింది. వీటిపై అనిరుధ్ స్పందించారు. 'పెళ్లా..? రూమర్స్ ప్రచారం ఆపండి' అంటూ సోషల్ మీడియా వేదికగా ఆ వార్తలను ఖండించారు. కావ్య.. సన్ గ్రూప్ ఛైర్మన్ కళానిధి మారన్ కుమార్తె. ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో మైదానంలో తనదైన హావభావాలతో పాపులర్ అయ్యారు. కళానిధి మారన్ నిర్మించిన 'జైలర్', 'బీస్ట్', 'రాయన్' తదితర చిత్రాలకు అనిరుధ్ సంగీతం అందించారు.


## నటి కల్పికపై మరో కేసు



ప్రిజం క్లబ్ వ్యవహారంలో సినీ నటి కల్పికపై ఇటీవల కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. తాజాగా ఆమెపై మరో కేసు నమోదు అయింది. ఇన్‌స్టా వేదికగా అసభ్య పదజాలంతో కల్పిక తనని దూషించిందని పేర్కొంటూ కీర్తన అనే బాధితురాలు తాజాగా హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. ఆన్‌లైన్ వేదికగా నటి వేధింపులకు పాల్పడుతుందని ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి ఆధారాలను పోలీసులకు అందించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## లిప్‌లాక్‌లకు తాను దూరం

### అలనాటి హీరోయిన్ మధుబాల



'రోజా' మూవీతో సినీ ప్రియుల హృదయాలు గెలుచుకున్న నటి మధుబాల. ఆ తరవాత జెంటిల్‌మెన్, అల్లరి ప్రియుడు వంటి సూపర్ చిత్రాల్లో మధుబాల పేరు సంపాదించుకుంది. మధుబాల ప్రస్తుతం 'కన్నప్ప' కోసం వర్క్ చేస్తున్నారు. ప్రస్తుతం సహాయ నటి పాత్రల్లో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తోన్న ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న పలు ఇబ్బందుల గురించి మాట్లాడారు. ముఖ్యంగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టినప్పుడు నటిగా తాను కొన్ని షరతులు పెట్టుకున్నానని తెలిపారు. ఒక సినిమా కోసం తాను ఆ రూల్ బ్రేక్ చేయాల్సి వచ్చిందన్నారు. తీరా చూస్తే ఆ సన్నివేశాన్ని తొలగించారని వెల్లడించారు. స్కిన్ షో లేదా ముద్దు సన్నివేశాల్లో నటించడం నాకు నచ్చేది కాదు. అందుకే కథానాయికగా ఎంట్రీ ఇచ్చిన సమయంలోనే ఆయా సన్నివేశాల్లో నటించకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఆ కారణంతోనే చాలా సినిమాలు వదులుకున్నా. అయితే, ఓ సినిమా కోసం నేను ఆ రూల్ బ్రేక్ చేయాల్సి వచ్చింది. సెట్‌లోకి అడుగుపెట్టిన తర్వాత కిస్ సీన్ చేయాలని టీమ్ చెప్పింది. నేను అందుకు అంగీకరించలేదు. కాకపోతే, ఆ సీన్ ముఖ్యమని టీమ్ చెప్పడంతో చేసేది లేకపోయింది. దాంతో లిప్ కిస్ సీన్‌లో యాక్ట్ చేశా. అది నన్నెంతో ఇబ్బంది పెట్టింది. తీరా చూస్తే ఎడిటింగ్ సమయంలో ఆ సన్నివేశం అవసరం లేదని టీమ్ భావించింది. దాంతో సీన్‌ను తొలగించేశారు. ఆ విషయంలో దర్శకుడితో నేను ఏమీ గొడవ పడలేదు. సినిమా కోసం ఎలాంటి సన్నివేశాల్లోనైనా యాక్ట్ చేయాల్సి ఉంటుందని కొంతమంది సీనియర్ నటీమణులను చూశాక నాకు అర్థమైందని మధుబాల చెప్పారు.

## సక్సెస్ అంటే.. స్వేచ్ఛగా ఉండడమే

### సమంత

స్వేచ్ఛను పొందడమే విజయమన్నారు అగ్ర కథనాయిక సమంత. సమంత ప్రధాన పాత్రలో సినిమా వచ్చి రెండేళ్లు అవుతోంది. విరామం తీసుకోవడం గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. విరామం తీసుకున్న తర్వాత విజయానికి నిర్వచనం మారిందని అర్థమైందన్నారు. "విజయానికి నిర్వచనం ఏంటంటే.. స్వేచ్ఛ అని వెంటనే చెబుతాను. అభివృద్ధి చెందడం, పరిణితి సాధించడం, బందీగా ఉండకపోవడమే నా దృష్టిలో స్వేచ్ఛ. అదే విజయం. రెండేళ్లుగా నా సినిమా విడుదల కాలేదు. ఈ విరామం సమయంలో నేను స్వేచ్ఛగా ఉన్నాను. నా చుట్టూ ఉన్న వాళ్లు గతంతో పోలిస్తే నేనిప్పుడు విజయం సాధించానని భావించడం లేదు. కానీ, నా దృష్టిలో నేను గతం కంటే ఎక్కువ సక్సెస్‌ఫుల్‌గా ఉన్నాను. నేను చేస్తోన్న ఎన్నో పనులు నాకు ఉత్సాహాన్నిస్తున్నాయి. వాటిని పూర్తిచేయడం కోసం ప్రతిరోజు ఎంతో ఆనందంగా నిద్ర లేస్తున్నాను" అని సమంత చెప్పారు. ఇక సినిమా విషయానికొస్తే.. సమంత బిగ్‌స్క్రీన్‌పై పూర్తిస్థాయిలో కనిపించి రెండేళ్లు అవుతోంది. ఇటీవల వచ్చిన 'శుభం'లో మాతాజీ అనే అతిథి పాత్రలో మెరిశారు. తొలిసారి నిర్మాణరంగంలోకి అడుగుపెట్టి 'శుభం'తో ప్రశంసలు అందుకున్నారు. అలాగే 'మా ఇంటి బంగారం' అనే సినిమాను ప్రకటించారు. ఈ నెలలో ఈ చిత్రం ప్రారంభం కానుంది. దీని తర్వాత వరుస చిత్రాలతో అలరిస్తానని ఇటీవల తెలిపారు.



## దర్శకుడిగా మారుతున్న కమెడియన్ రామకృష్ణ



టాలీవుడ్ కమెడియన్ రాహుల్ రామకృష్ణ దర్శకుడిగా మారనున్నారు. నటులు చాలామంది హీరోలుగా లేదా దర్శకులుగా మారుతున్నారు. ఇప్పటికే వేణు బలగం సినిమాతో దర్శకుడుగా మంచి పేరు సంపాదించారు. ఈ క్రమంలో రామకృష్ణ కూడా త్వరలోనే మెగాఫోన్ పట్టి ఒక చిత్రాన్ని తెరకెక్కించ నున్నారు. ఈ మేరకు ఆయన ప్రయత్నాలు మొదలుపెట్టారు. తాను దర్శకత్వం వహించనున్న తొలి ప్రాజెక్ట్‌కు సంబంధించి నటీమణుల ఎంపిక ప్రారంభించారు. ఇదే విషయాన్ని తెలియజేస్తూ ఎక్స్ వేదికగా శనివారం ఉదయం ఆయన పోస్ట్ పెట్టారు. దర్శకుడిగా నా తొలి ప్రాజెక్ట్.. మీలో ఎవరికైనా ఆసక్తి ఉంటే దయచేసి మీ షోరీల్స్, ఫొటోలను నా మెయిల్‌కు పంపించగలరని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఆయనే నిర్మాతగానూ వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది. షార్ట్ ఫిల్మ్స్‌తో నటుడిగా మారిన రాహుల్ రామకృష్ణ.. 'జయమ్ము నిశ్చయమ్మురా'తో పరిశ్రమకి ఎంట్రీ ఇచ్చారు. ఈ చిత్రానికి డైలాగ్ రైటర్‌గానూ వర్క్ చేశారు. 2017లో విడుదలైన 'అర్జున్ రెడ్డి' ఆయనకు గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆ సినిమా తర్వాత ఆయన తెలుగులో 'భరత్ అనే నేను', 'చి.ల.సౌ.', 'గీత గోవిందం', 'కల్కి', 'బ్రోచేవారెవరురా', 'అల.. వైకుంఠపురములో..', 'జాతిరత్నాలు', 'ఓం భీమ్ బుష్' వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించారు.




## 'కన్నప్ప' ట్రైలర్ వచ్చేసింది..

మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్టు 'కన్నప్ప'. శివ భక్తుడైన కన్నప్ప జీవిత చరిత్ర ఆధారంగా రూపొందడం, ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయ్ కుమార్ తదితర స్టార్ హీరోలు కీలక పాత్రలు పోషించడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ప్రచారంలో భాగంగా చిత్ర బృందం ట్రైలర్‌ను శనివారం విడుదల చేసింది. తిన్నడుగా విష్ణు, రుద్ర పాత్రలో ప్రభాస్, శివుడిగా అక్షయ్‌కుమార్ నటించారు. 'మహాభారతం' సీరియల్ ఫేమ్ ముకేశ్ కుమార్‌సింగ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 27న రిలీజ్ కానున్న సంగతి తెలిసిందే.

## క్రేజీ హీరోయిన్ శ్రీలీల బర్త్‌డే

### రెండు సినిమాలకు సంబంధించి పోస్టర్ల విడుదల



ప్రస్తుతం సౌత్ లో క్రేజీ హీరోయిన్‌గా దూసుకుపోతోంది శ్రీలీల. ఈ ముద్దుగుమ్మ జూన్ 14 తన పుట్టినరోజును జరుపుకుంది. ఈ సందర్భంగా ఆమె నటిస్తున్న రెండు భారీ ప్రాజెక్టుల నుంచి బ్యాక్ టూ బ్యాక్ స్పెషల్ పోస్టర్స్‌ను విడుదల చేశారు నిర్మాతలు. ఇందులో 'ఉస్తాద్ భగత్ సింగ్' ఒకటి. మాస్ రాజా రవితేజ 'మాస్ జాతార' మూవీ నుంచి కూడా బర్త్‌డే స్పెషల్ పోస్టర్ విడుదలైంది. ఇందులో శ్రీలీల మరోసారి ట్రెడిషనల్ లుక్‌లో కనిపించి ఫ్యాన్స్‌ను ఫిదా చేసింది. ఇక ఈ రెండు పోస్టర్లు బర్త్‌డే సందర్భంగా విడుదల కావడంతో శ్రీ లీల అభిమానులు సోషల్ మీడియాలో భారీగా పోస్టులు షేర్ చేస్తున్నారు.

## పాక్‌లో దంగల్‌ను అందుకే విడుదల చేయలేదు

### ఆనాటి వివరాలు వెల్లడించిన అమీర్ ఖాన్



బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్ వైవిధ్యమైన సినిమాలతో ప్రేక్షకులని ఎంతగా అలరిస్తున్నారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అమీర్‌ఖాన్ దర్శకత్వం వహించడంతో పాటు- ప్రధాన పాత్రలో రూపొందిన తారే జమీన్ పర్ 2007లో విడుదలై సంచలన విజయం సాధించింది.. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా రూపొందించిన సినిమా సితారే జమీన్ పర్ . 2018లో స్పానిష్ ఛాంపియన్స్ మూవీ ఆధారంగా హిందీలో రూపొందించిన ఈ సినిమాకు దివ్య నిధి శర్మ కథ అందించగా . ఆర్. ప్రసన్న దర్శకత్వం వహించాడు. ఈ మూవీని అమీర్ ఖాన్ స్వయంగా నిర్మించాడు. జెనీలియా దేశ్‌ముఖ్ కీలక పాత్ర పోషించింది. జూన్ 20న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. గత కొద్ది రోజులుగా మూవీ ప్రమోషన్స్‌తో బిజీగా ఉన్న అమీర్ ఖాన్ ఆసక్తికర విషయాలు పంచుకుంటు-న్నారు. ఆయన నటించిన బ్లాక్‌బస్టర్ మూవీ 'దంగల్' పాకిస్తాన్‌లో ఎందుకు విడుదల కాలేదన్న అంశంపై తాజాగా వివరణ ఇచ్చారు. పాక్ లో దంగల్ సినిమా విడుదల కావాలంటే వారు రెండు షరతులు పెట్టారు. మన జాతీయ గీతం, జాతీయ జెండాను మూవీ నుంచి తొలగించాలని అక్కడి సెన్సార్ బోర్డు చెప్పడంతో నేను దానికి ఏ మాత్రం అంగీకరించలేదు. గీతా ఫోగట్ మ్యాచ్ గెలిచిన సన్నివేశంలో భారత జెండాతో పాటు జాతీయ గీతం ఉంటుంది. ఆ రెండింటిని తొలగిస్తినే ఈ చిత్రానికి అనుమతి ఉంటుందని పాక్ సెన్సార్ చెప్పింది. దీంతో వెంటనే నేను మా సినిమా పాకిస్తాన్ లో విడుదల కాదని చెప్పాను. పాకిస్తాన్ విడుదలను రద్దు చేయడం వల్ల కలెక్షన్స్ విషయంలో కాస్త ప్రతికూల ప్రభావం పడుతుందని నిర్మాతలు నాతో చెప్పారు. అయినప్పటికీ, భారతదేశానికి వ్యతిరేకంగా ఉన్న దేనికీ మద్దతు ఇవ్వకూడదని స్పష్టంగా ఆరోజే చెప్పాను అని అమీర్ ఖాన్ అన్నారు. సినిమా విడుదల వల్ల డబ్బు వస్తుంది, కానీ దేశ ప్రయోజనాల విషయంలో మేము రాజీ పడం. దేశానికి వ్యతిరేకంగా ఏ నిర్ణయానికీ మేము ఒప్పుకోము. ఇది నా ఒక్క నిర్ణయమే కాదు, అందరం కూడా అదే అభిప్రాయంతో ఉన్నామని అమీర్ స్పష్టం చేశారు.

Printed published and owned by LANDE BHASKER .Printed at Karuna Sree publicationsH.no .3-135/24,Chityal Village,Tadwai Mandal, Telangana. And published from H.no.3-135/24, Chityal Village, Tadwai Mandal,Telangana.Editor - LANDE BHASKER.RNI TELTEL/2024/89275 . PHONE NO: 9542559271 E-MAIL ID: bhaskerlande20@gmail.com